


# విజయభాను




విశాఖపట్నం, ఆదివారం 22-04-2018 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 41 సంచిక : 217 పేజీలు : 8 వెల : 1 రూపాయి

# మరణదండనే

### చిన్నారులపై అత్యాచారాలపై కేంద్రం సంచలన నిర్ణయం • మోదీ నిర్ణయం.. ఆర్డినెన్స్ జారీ



న్యూఢిల్లీ : 12 ఏళ్ల లోపు చిన్నారులపై అత్యాచారం చేస్తే ఆ నిందితులకు మరణశిక్ష తప్పనిసరి. మరణశిక్ష విధించేలా పోక్సో చట్టానికి సవరణలు చేస్తూ కేంద్రం ఆర్డినెన్స్ జారీ చేసింది. ఈ ఆర్డినెన్స్‌ను కేంద్రమంత్రి వర్గం శనివారం ఆమోదించింది. 12 ఏళ్ల లోపు చిన్నారులపై అత్యాచారం జరిపే వారికి మరణశిక్ష విధించేలా ఆర్డినెన్స్ జారీ చేశారు. ఈ ఆర్డినెన్స్‌ను ఆమోదం కోసం రాష్ట్రపతికి కేంద్రం పంపనుంది.

12 నుంచి 16 సంవత్సరాల లోపు అమ్మాయిలపై అత్యాచారం చేస్తే 10 నుంచి 20 సంవత్సరాలకు జైలు శిక్ష పొడిగించారు. కేసు తీవ్రతను బట్టి.. జీవిత ఖైదు కూడా విధించే అవకాశం ఉంది. మహిళలపై అత్యాచారానికి పాల్పడే వారికి పదేళ్ల జైలు శిక్ష లేదా జీవిత ఖైదు విధించేలా శనివారం ఆర్డినెన్స్ తీసుకువచ్చారు. త్వరితగతిన దర్యాప్తు, విచారణ చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని కేంద్రమంత్రివర్గం నిర్ణయించింది. క్రిమినల్ చట్టంలో మార్పులు తీసుకురావాలని కేంద్రం నిర్ణయం తీసుకుంది. నేరపూరిత ఆలోచనలు కూడా అరికట్టేలా కఠిన చట్టం తేవాలని కేంద్రం నిర్ణయించింది.

## రెడ్‌క్రాస్ చేపడుతున్న కార్యక్రమాల్లో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలి

- అవార్డుల ప్రదానోత్సవంలో రాష్ట్ర గవర్నర్ నరసింహన్
- రెడ్‌క్రాస్ వెబ్‌సైట్‌ను ప్రారంభించిన గవర్నర్




విశాఖపట్నం : సేవే పరమావధిగా భావిస్తూ, బాధితులకు అండగా నిలుస్తున్న రెడ్‌క్రాస్ సంస్థ కార్యకలాపాల్లో ప్రజలందరూ పాల్గొనాలని రాష్ట్ర గవర్నర్ ఇఎస్ఎల్. నరసింహన్ పిలుపునిచ్చారు. శనివారం వుడా చిల్డ్రన్ థియేటర్‌లో రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన గత రెండు సంవత్సరాలకు బంగారు పతకాలు, సేవా అవార్డుల బహుమతి ప్రదాన కార్యక్రమంలో గవర్నర్ ముఖ్య అతిధిగా హాజరైనారు. ఈ సందర్భంగా 85 బంగారు పతకాలను, 11 సేవా మెమెంటోలను 6 షీల్డులను అందజేశారు. అదే విధంగా సభ్యత్వ రుసుములను అధికంగా సేకరించిన 6 జిల్లా బ్రాంచీలకు కప్పులను, అవార్డులను అందజేశారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ రెడ్ క్రాస్ సంస్థ ద్వారా ప్రధానంగా బ్లడ్ బ్యాంకులకు అనుసంధానంగా వుంటూ రక్తదాన కార్యక్రమాల్లో పాల్గొంటూ అనేక జీవితాలకు పునర్జన్మలను ప్రసాదిస్తోందని కొనియాడారు.

అనేక మంది అనాధలకు జీవితాలను ప్రసాదించడంలోను, విపత్తు సమయాల్లో ప్రాథమిక చికిత్సలు అందించడం, అనాధలను, తరువాయి 2లో

# బాలకృష్ణపై గవర్నర్‌కు భాజపా నేతల ఫిర్యాదు



విశాఖపట్నం : సినీనటుడు, తెదేపా ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణపై భాజపా నేతలు రాష్ట్ర గవర్నర్ నరసింహన్‌కు ఫిర్యాదు చేశారు. విశాఖపట్నానికి వచ్చిన గవర్నర్‌ను భాజపా నేతలు ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, ఎమ్మెల్సీ పివిఎన్ మాధవ్, నాగేంద్ర శనివారం ఉదయం ప్రభుత్వ అతిథి గృహంలో కలిశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుక్రవారం విజయవాడలో నిర్వహించిన ధర్మ పోరాట దీక్షలో బాలకృష్ణ ప్రధాని నరేంద్ర మోదీపై అనుచిత వ్యాఖ్యలు చేశారని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించాల్సి ఉందని వారు గవర్నర్‌కు తెలిపారు. వెంటనే బాలకృష్ణపై చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు.

#### బాలకృష్ణ వ్యాఖ్యలు సరికాదు

ప్రధాని మోదీపై బాలకృష్ణ వ్యాఖ్యలు సరికాదు బీజేపీ నేత మాణిక్యాలరావు అన్నారు. సీఎం ధర్మపోరాట దీక్షతో రూ.30కోట్ల ప్రజాధనం వృథా అయిందని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...చంద్రబాబు చేసింది రాజకీయ అస్తిత్వ దీక్ష అన్నారు. ప్రధాని మోదీ దీక్ష చేస్తే ఖర్చులేదు... పాలన స్తంభించలేదని, చంద్రబాబు దీక్ష నాటకీయంగా సాగిందని మాణిక్యాలరావు విమర్శించారు. సీఎంను తరువాయి 2లో

## బాగా ఆలోచించి నిర్ణయం తీసుకుంటా

### సీబీఐ పూర్వ జేడీ లక్ష్మీనారాయణ



విశాఖపట్నం: ప్రజలకు ఏ విధంగా ఉపయోగపడతానో బాగా ఆలోచించు కున్న తర్వాతే రాజకీయా ల్లోకి వచ్చే అంశంపై స్పందిస్తా నని సీబీఐ పూర్వ జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. శని వారం విశాఖ వచ్చిన ఆయన సీతమ్మధారలోని వినాయక ఆలయాన్ని సందర్శించారు. వేద పండితులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మీడియాతో మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా వస్తే రాష్ట్రానికి పరిశ్రమలు వస్తాయని, తద్వారా యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని అభిప్రాయపడ్డారు. ఇటీవల స్వచ్ఛంద ఉద్యోగ విరమణ (వీఆర్ఎస్)కు దరఖాస్తు చేసుకున్న లక్ష్మీనారాయణ రాజకీయాల్లోకి వస్తారంటూ పెద్దఎత్తున ప్రచారం జరిగిన విషయం తెలిసిందే.

## వైఎస్ జగన్‌కు జననీరాజనం



కృష్ణా : వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్పయాత్ర కృష్ణా జిల్లాలో విజయవంతంగా కొనసాగుతోంది. 141వ రోజు ఈదర శివారు నుంచి శనివారం ఉదయం వైఎస్ జగన్ పాద యాత్రను ప్రారంభించారు. అనంతరం సీతారాంపురం, బత్తుల తరువాయి 2లో

## ఐకమత్యంగా ఉండి, ముక్తకంఠంతో పోరాడాలి

అమరావతి: భాజపా దొంగాట, దూకుడుకు కళ్లెం వేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. ప్రజాదర్బార్ హాల్‌లో సాధికార మిత్రలతో సీఎం ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రానికి న్యాయం కోసం ముఖ్యమంత్రిగా ప్రధానితో పోరాడుతున్నా.. అందరూ సహకరించి ఏకతాటిపైకి రావాలి. ప్రజలను చైతన్య పరిచి పోరాటానికి సిద్ధం చేసేందుకే దీక్ష చేశా. లాలూచీ రాజకీయాల వల్ల మనం నష్టపోతాం. ఈ రాష్ట్రం ఐకమత్యంగా ఉంటే, 5కోట్ల మంది ముక్తకంఠంతో తరువాయి 2లో

## ఏపీ రాష్ట్రవ్యాప్తంగా తెదేపా సైకిల్ యాత్రలు



అమరావతి : కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి చేసిన అన్యాయాన్ని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా తెదేపా సైకిల్ ర్యాలీలు కొనసాగుతున్నాయి. మంత్రులు, ఎమ్మెల్యలు, ఎమ్మెల్సీలు, పార్టీ శ్రేణులు ఈ కార్యక్రమంలో తరువాయి 2లో

### నేను ఇండియన్, హిందూ, మాదిగ

# క్రిస్టియన్‌ను కాదు

- శివుడు, వేంకటేశ్వర స్వామి నా ఆరాధ్య దైవాలు
- మతతత్వ పార్టీలైన బిజెపి, వైకాపా రాజకీయం చేస్తున్నాయి
- పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటా
- ఎమ్మెల్యే వంగలపూడి అనిత



ప్రపంచ ప్రసిద్ధి చెందిన తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) బోర్డు నియామకానికి ఏపీ ప్రభుత్వం చైర్మన్, సభ్యుల పేర్లను ఖరారు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, నిత్యం ఆరోపణలతో ఉన్న టీటీడీ బోర్డులో నూతన బోర్డు మెంబర్లలో ఉన్న విశాఖపట్నానికి చెందిన పాయకరావుపేట ఎమ్మెల్యే వంగలపూడి అనిత నియామకాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్రంలో ఉన్న కొన్ని సామాజిక వర్గాలు, బ్రాహ్మణ సంఘాలు తీవ్ర అభ్యంతరాన్ని వ్యక్తం చేస్తున్నాయి. ఇటీవల కాలంలో ఒక న్యూస్ ఛానెల్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో అనిత తాను క్రిస్టియన్‌ను అని, బైబిల్ లేనిదే తాను బయటకు రానని అనిత మాట్లాడిన మాటలను కొంతమంది సోషల్ మీడియా ద్వారా వెలుగులోకి తెచ్చారు. దీనిపై స్పందించిన ప్రభుత్వ పెద్దలు సందిగ్ధంలోపడి తదుపరి కార్యాచరణకు సిద్ధమౌతున్నారు. -- వార్త 2వ పేజీలో..






## మీడియాపై దాడికి
# ఏపీడబ్ల్యూజేఎఫ్ ఖండన

విశాఖపట్నం: హైదరాబాద్‌లో ఫిల్మ్ ఛాంబర్ వద్ద మీడియాపై శుక్రవారం సాయంత్రం జరిగిన దాడిని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్), ఆంధ్రప్రదేశ్ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్ట్ అసోసియేషన్ ( ఎపిబిజెఎ ) విశాఖ నగరశాఖలు తీవ్రంగా ఖండించాయి. సినీహీరో పవన్‌కళ్యాణ్ అభిమానులు ఏబీఎన్ ఆంధ్రజ్యోతి, టీవీ9 ఓబీ వ్యాన్లపై దాడి చేయడం సరికాదని ఇది పత్రికా స్వేచ్ఛకు గొడ్డలి పెట్టు వంటిదని ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, నగరశాఖ అధ్యక్షులు పి.నారాయణ్, ఏపీబీజేఏ నగర అధ్యక్షులు ఇరోతి ఈశ్వరరావులు అన్నారు. మీడియాలో వచ్చే వార్తలు నచ్చనట్లయితే కోర్టుల ద్వారా తేల్చుకోవాలి తప్ప ప్రత్యక్ష చర్యలకు దిగడం మంచి పద్ధతి కాదన్నారు.

ముఖ్యంగా మీడియా సంస్థలపై అసంతృప్తితో ఉన్నట్లయితే న్యాయం, చట్టపరంగా చర్యలు తీసుకోవాలి తప్ప ఓబీ వ్యాన్లపై దాడులకు దిగడం ప్రజాస్వామ్య వాదులు సమర్ధించరని పేర్కొన్నారు. మీడియా సంస్థల ప్రతినిధులను దూషించడాన్ని తప్పుబట్టారు. మీడియాపై జరిగిన దాడులను ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డి.రవికుమార్, కోశాధికారి, బ్రాడ్‌కాస్ట్ అసోసియేషన్ నగర కార్యదర్శి ఎ.సాంబశివరావులు తీవ్రంగా ఖండించారు.

## యువకునిపై హత్యాయత్నం

భీమునిపట్నం: ఈ సంఘటన మండలంలోని చేపలుప్పాడలో జరిగింది. భీమిలి పోలీసులు ఇచ్చిన వివరాలు ప్రకారం చేపలుప్పాడలో చెన్నా హరి ప్రసాద్ (25) ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కాగా గురువారం హరి ప్రసాద్ ఇంట్లో అమ్మ వారి పండుగ జరిగింది. కాగా అదే రోజు రాత్రి హరి ప్రసాద్ తన స్నేహితులుతో మద్యం తాగి ఇంటికి వస్తున్నప్పుడు ద్విచక్ర వాహనంపై ఇద్దరు యువకులు వచ్చి హరి ప్రసాద్‌ను కత్తితో పొడిచి వెళ్ళిపోయినట్లు పోలీసులు తెలిపారు. కాగా హరిప్రసాద్ ను చికిత్స నిమిత్తం కెజిహెచ్ కు తరలించారు. హరిప్రసాద్ గతంలో రౌడీ షీటర్‌గా ఉండేవాడనీ పాత కక్షల వలన దాడి జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఎస్.ఐ.వాసు నాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## *మే 5 న గీతం ఎమ్మెస్సీ ప్రవేశ పరీక్ష*

సాగర్‌నగర్ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ స్థాయిలో నిర్వహిస్తున్న ఎమ్మెస్సీ అప్లైడ్ మేథ్స్, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, ఫిజిక్స్, బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, మైక్రోబయాలజీ, ఫుడ్ సైన్స్ టెక్నాలజీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, బయో ఇన్ఫర్మేటిక్స్, ఎలక్ట్రానిక్ సైన్స్,డేటా సైన్స్ కోర్సులతో పాటు మూడేళ్ల కాల వ్యవధి గల ఎంసిఎ కోర్సును నిర్వహిస్తున్నారు. ఈ కోర్సులకు ఈ ఏడాది మే 5 వ తేదిన జాతీయ స్థాయిలో గీతం సైన్స్ అడ్మిషన్ టెస్ట్ (జీశాట్-2018) పేరిట ప్రవేశ పరీక్షను నిర్వహిస్తారు.ఈ కోర్సులలో ప్రవేశం పొందగోరేవారు గీతం వెబ్‌సైట్ నుంచి దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకుని ఏప్రిల్ 25వ తేది లోగా అందజేయవలసి ఉంటుందని గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.అరుణలక్ష్మి తెలిపారు.

## న్యాయవాది శామ్యూల్ జయంతి

భీమునిపట్నం : స్థానిక ఎస్.ఓ.ఎస్. విలేజ్ లో స్థానిక న్యాయవాది అంబటి శామ్యూల్ జయకుమార్ జయంతి ఘనంగా జరిగింది. ఆయన స్నేహితులు విలేజే వున్న పిల్లలతో కేక్ కట్ చేసి పిల్లలకు కేక్ , బిస్కెట్స్ , పాలు,పెన్నులు పంపిణి చేశారు.ఆయన భీమిలి,విశాఖ బార్‌లో న్యాయవాదిగా వుంటూ విశాఖ జిల్లా కోర్టు కు క్రికెట్ టిమ్‌కి కెప్టెన్ గా వుండేవారు. అతను న్యాయవాదిగాను, క్రికెట్ ఆటగాడిగా మంచి పేరు సంపాదించారు.ఈ కార్యక్రమం లో ఎస్.ఓ.ఎస్.డైరెక్టర్ జి.ఎ.స్వామి,సిబ్బంది కమల్, న్యాయవాది జి.సుశీల,స్నేహితులు అడిదం.అంజనకుమార్, పొడుగు.గణేష్, వర్మ, నాచు హరి, శ్రీనివాస చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

## ఆస్తిపన్ను చెల్లించండి - 5 శాతం రాయితీ పొందండి

**ఏప్రిల్ 22 మరియు 29 తేదీలలో సౌకర్యం కేంద్రాలలో చెల్లించవచ్చు**

*కమిషనర్ హరినారాయణన్*

విశాఖపట్నం : నగరపాలక సంస్థల చట్టము ననుసరించి ఇంటి పన్ను చెల్లింపు దార్లు 2018-19 ఆర్ధిక సంవత్సరమునకు సంబంధించిన ఏకమొత్తం ఆస్తిపన్ను ను అనగా ఒకటి మరియు రెండు అర్ధ సంవత్సరములకు సంబంధించిన పన్నును తేది 30.04.2018 లోగా డిమాండు నోటీసు / బిల్లు పంపిణీతో సంబంధం లేకుండా చెల్లించినచో, మొత్తం సంవత్సరమునకు గల ఆస్తిపన్ను మొత్తము నుండి 5 శాతం రాయితీ పొందవచ్చును. కావున మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ పరిధిలోని ఆస్తిపన్ను చెల్లింపు దార్లు ఈ అవకాశమును సద్వినియోగం చేసుకొని 2018-19 సంవత్సరము యొక్క ఆస్తిపన్నును చెల్లించి 5 శాతం రాయితీని పొందవలసినదిగా కోరడమైనది. మరియు

తేది 22 మరియు 29 ఏప్రిల్, 2018 లలో జివియంసి ప్రధాన కార్యలయము మరియు జోనల్ కార్యాలయములలో గల సౌకర్యం సెంటర్లు తెరువబడియుండును కావున ఈ అవకాశమును వినియోగించు కోనవల సినదిగా కోరడమైనది.

## విభజన హామీల అమలుకై సైకిల్ యాత్ర



భీమునిపట్నం : భీమిలి మంత్రి గంటా క్యాంపు కార్యాలయంలో శనివారం ప్రత్యేక హోదా మరియు విభజన హామీల అమలుకై సైకిల్ యాత్ర నిర్వహించారు. ముందుగా కార్యాలయంలో యన్.టి.ఆర్. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం కార్యాలయం వద్ద పార్టీ జెండా ఆవిష్కరించి సైకిల్ యాత్రలో మంత్రులు గంటా శ్రీనివాసరావు, పితాని సత్యనారాయణ, గంటా ప్రతినిధి చిక్కాల విజయబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ కోరాడ నాగ భూషణ రావు పార్టీ కార్యాలయం నుండి బయలుదేరి చిన్నబజార్ వరకూ సైకిల్‌తో ర్యాలీగా వెళ్లి అక్కడ వున్న యన్.టి.ఆర్. విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో భీమిలి ఎంపిపి యరబాల కృష్ణవేణి, అనీల్ ప్రసాద్ , రూరల్ తెలుగు మహిళా అధ్యక్షురాలు కురిమిన లీలావతి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బి.ఎర్రిబాబు, మాజీ చైర్ పర్సన్ కొప్పల ప్రభావతి, పద్మనాభం మండల పార్టీ ప్రెసిడెంట్ కాళ్ళ.నగేష్ , భీమిలి, తగరపువలస డివిజన్ అధ్యక్షులు గంటా నూకరాజు, కొప్పలరమేష్, రూరల్ మండల నాయకులు డి.ఎ.ఎన్. రాజు,మాజీ ఎం.పి.పి.గాడు వెంకటప్పుడు, టీడీపీ నాయకులు కోరాడ రాజబాబు, మాజీ కౌన్సిలర్లు, ఎస్సీ సెల్ అధ్యక్షులు రవ్వ వెంకటరావు, పి.యోగి, కె.నాగరాజు, వి.కోదండ, గిడుతూరి శ్రీనివాసరావు ,జి.పోలిరాజు. ఎస్.సూర్యనారాయణ, కె.అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

## ఐశ్వర్య వేంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలకు ఏర్పాట్లు



భీమునిపట్నం : స్థానిక కిటిన్ పేట వద్ద నూతనంగా నిర్మించిన ఐశ్వర్య వెంకటేశ్వర స్వామి ఆలయం లో ఈ నెల 24 నుంచి 29 వరకూ స్వామివారి విగ్రహ,ద్వజస్థంభం ప్రతిష్ట మహోత్సవాలు గణంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని. ఐశ్వర్య వెంకటేశ్వర స్వామి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కమ్ మేనేజింగ్ ట్రస్ట్ కలిగొట్ల సూర్యనారాయణ మూర్తి తెలిపారు. ఈ ఉత్సవాలు సింహాచలం విశ్రాంతి పురోహితులు మోర్తా సీతారామచార్యులు పర్యవేక్షణలో నిర్వహిస్తున్నామని ఈ ఉత్సవాల్లో భక్తులు పాల్గొనాలని కోరారు. ఇందులో ఐశ్వర్య వెంకటేశ్వర స్వామి చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు కలిగొట్ల. శ్రీరామ చంద్ర మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## *24 వరకు ఆసెట్ దరఖాస్తు గడువు పెంపు*


ఆంధ్రవిశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలల్లో పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఆసెట్, ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రవేశాలకు నిర్వహించే ఆఈట్ ప్రవేశ పరీక్షల దరఖాస్తు గడువును ఈ నెల 24వ తేదీ వరకు పొడిగించినట్లు ప్రవేశాల సంచాలకులు ఆచార్య కె.రాజేంద్ర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

విద్యార్థుల నుంచి వచ్చిన విజ్ఞాపనలు పరిగణలోనికి తీసుకుని గడువు పొడిగించామన్నారు. రూ 1000 అపరాధ రుసుముతో ఆసెట్‌కు, రూ 1500 అపరాధ రుసుముతో ఆఈట్‌కు ఈ నెల 30వతేదీ వరకు దరఖాస్తు చేయవచ్చునన్నారు.

ఈ నెల 30వ తేదీ తరువాత దరఖాస్తుల స్వీకరణ జరగదన్నారు.

## హోదా సాధించే వరకూ
# ఉద్యమం ఆగదు

**కదం తొక్కిన వాసుపల్లి సేన .. నిరసన.. సైకిల్ ర్యాలీ**



విశాఖపట్నం: హోదా సాధించే వరకు ఉద్యమం ఆగదని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ స్పష్టం చేశారు. ఐదు కోట్ల ఆంధ్రుల ఆగ్రహజ్వాలలు ముందు ఎంతటివారైనా దిగిరాక తప్పదని ఆయన అన్నారు. హోదా డిమాండ్‌తో వాసుపల్లి సేన కదంతొక్కింది. పాతనగరంలో నిరసన.. సైకిల్ ర్యాలీ చేపట్టింది. కేంద్రం వైఖరిని పాటల రూపంలో ఎండగడుతూ ర్యాలీ కొనసాగించారు. ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు అంటూ నినాదాలు చేశారు. కోటవీధి, ఫెర్రీ వీధి, థాంప్సన్ వీధి, అంబుసరంగువీధి, సోల్జర్‌పేట్, కన్వేయర్ బెల్ట్ వీధి, గాంధీ బొమ్మ సెంటర్ వీధి, బుక్కా వీధి, ఘోషా ఆసుపత్రి జంక్షన్, ఎంబర్‌మన్నార్ దేవస్తానం రోడ్డు, హార్బర్ రోడ్డు, టౌన్‌హాల్ రోడ్డు మీదుగా ర్యాలీ కొనసాగింది. వాడవాడలా ఎమ్మెల్యేకు ప్రజలు ఘనస్వాగతం పలికారు. ప్రతీ వాడలోని ప్రజలతో ఆయన మాట్లాడారు. తెలుగువారి పట్ల కేంద్రం అవలంబిస్తోన్న నిర్లక్ష్య వైఖరిని వారికి వివరించారు. తెలుగోడి సత్తా చాటుదాం అంటూ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గోడి నరసింహాచారి, వాసుపల్లి దానేష్, మైలపల్లి శ్రీను, తిత్తి సాయి బలరాం, హనీఫ్, బాబ్జి, వశిశెట్టి తాతాజీ, గనగళ్ల రామరాజు, ఆలేటి వెంకటరావు, డొకర రమణ, పెద్ద సంఖ్యలో తెలుగు తమ్ముళ్లు పాల్గొన్నారు.

## కులాంతర వివాహంచేసుకున్న జంటకు చంద్రన్న కానుక అందజేసిన మంత్రి గంటా, ఎమ్మెల్యే వాసుపల్లి



సింహాచలం : నేడు కొండద్రిగువున గల పుష్కరిణి సత్రంలో కులాంతర వివాహం చేసుకున్న వధూవరులు నందిని హరీష్ లూ (కాపు ,ఎస్ సీ )కులానికిచెందినవారు వీరి వివాహం రాజకీయ ప్రముఖుల కుటుంబ సభ్యుల మద్య సందడిగా జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులు గా మంత్రివర్యులు గంటాశ్రీనివసరావు మరియు దక్షిణ నియోజకవర్గం ఎం ఎల్ ఏ వాసుపల్లి గణేశ్ కుమార్ హాజరుకాగా నూతనవధూ వరులకు చంద్రన్న పెళ్లికానుక కులాంతర వివాహం క్రింద ప్రభుత్వం తరపున 75 వేల రూపాయల అందజేశారు.

గంట శ్రీనివసరావు తనవంతుగా 25 వేల రూపాయల అందజేయగా ఎం ఎల్ ఏ వాసుపల్లి గణేశ్ కుమార్ తనవంతుగా 10 వేల రూపాయలు వధూవరులకు అందజేసి ఆశీర్వదించారు ది అడివివరం కో ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ మరియు టిడిపి నాయకులు అయినటువంటి కర్రి స్వామి గంటా నారాయణమ్మ చారిటబుల్ ట్రస్ట్ పేరున 5 వేల రూపాయలను నూతన వధూవరులకు అందజేసి ఆశీర్వదించారు


ఈ సందర్భంగా గంటా మాట్లాడు తూ చంద్రన్న పెళ్లికానుక పథకం ద్వారా పేద మద్య తరగతి కుటుంబాలలో ఆర్థికంగా దన్ను మరియు ఉత్సాహం వస్తాయని ఈ పథకం వారికి ఎంతో ఉపయుక్తంగా వుంటాదని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో వీరితో పాటుగా భీమిలి ఇంచార్జి విజయబాబు టిడిపి డిస్ట్రిక్ట్ అర్బన్ ఉపాధ్యక్షులు పాశర్ల ప్రసాద్ టిడిపి నాయకులు పి వి నరసింహం రాజనాల సత్తిబాబు మజ్జి సూరి బాబు సతివాడ శంకరరావు, బుచ్చరామరెడ్డి, జన్మభూమి కమిటీ సభ్యులు నర వల అప్పరావు టీడీపీ నాయకుల ముగ్గు కిరణ్ మజ్జి అప్పలనాయుడు మజ్జి కోటేశ్వరరావు ఇతర కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.


# 16వ వార్డును మరింత పరిశుభ్రంగా తీర్చిదిద్దండి

- మద్దిలపాలెం, పిఠాపురం కాలనీని సందర్శించిన కమిషనర్
- పిఠాపురం కాలనీ మార్కెట్‌ను వినియోగంలోకి తేవాలి
- రోడ్డు పైనున్న షాపులను రెగ్యులేట్ చేసి మార్కెట్‌లో ఉంచండి
- ఖాళీ స్థలాలలో చెత్త లేకుండా చూడండి - సోర్స్ సెగ్రిగేషన్‌ను అపార్ట్‌మెంట్లలో పరిశీలన
- డ్రెయిన్ క్లియరెన్స్ చేయడం ద్వారా మురుగు లేకుండా చూడండి

**కమిషనర్ హరినారాయణన్**



విశాఖపట్నం : జివియంసి 16వ వార్డును మరింత పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని కమిషనర్ హరినారాయణన్ ఆదేశించారు. క్షేత్రపర్యటనలోభాగంగా 16వ వార్డుకు చెందిన మద్దిలపాలెం, పిఠాపురం కాలనీలను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా పిఠాపురం కాలనీ మార్కెట్‌ను వినియోగంలోకి తేవాలని కోరారు. అవిధంగా టాయిలెట్లను మరమ్మత్తుచేసి అందరికి ఉపయోగపడేలా తీర్చిదిద్దాలని సూచించారు. మార్కెట్‌లో షాపులు ఖాళీగా ఉన్నాయని, రోడ్డుపై వ్యాపారాలు చేస్తున్నారని పేర్కొంటూ వారిని మార్కెట్ షాపులను వినియోగించుకొనేలా చూడాలని పేర్కొన్నారు. అవసరమైనచోట విద్యుత్ దీపాలను మరమ్మత్తు గావించాలని సూచించారు. ఖాళీ స్థలాలలో చెత్త వేయకుండా, లేకుండా చూడాలని ఆదేశించారు. అనంతరం అపార్ట్‌మెంట్‌లలో సోర్స్ సెగ్రిగేషన్ చేస్తున్నది లేనిది పరిశీలించారు. కొంతమంది సహకరించడం లేదని శానిటరీ ఇన్‌స్పెక్టర్ పేర్కొనగా జరిమాన విధించాలని లేకుంటే చెత్తను తరలించవద్దని ఆదేశించారు. డ్రెయిన్లను క్లియర్ చేసి మురుగు నిల్వకు అవకాశం లేకుండా చూడాలని ఇ.ఇ వెంకటిని ఆదేశించారు. పారిశుధ్య సిబ్బంది రోడ్డు మార్జిన్లను సక్రమంగా నిర్వహించాలని పేర్కొన్నారు. పర్యటనలో రెండవ జోనల్ కమిషనర్ పి.నల్లనయ్య, ఇ.ఇ వెంకటి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బంగార్రాజు, ఏ.ఇ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



## మానవ సేవే మాధవ సేవగా విశేష సేవలు అందిస్తున్న ఎన్‌టిఆర్ సేవా సమితి మరియు ఎమ్‌పిఎమ్ ట్రస్టు



విశాఖపట్నం : రాష్ట్ర శాస న మండలి సభ్యుడు డాక్టర్ ఎమ్.వి.వి.ఎస్. మూర్తి ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్న ఎం.పి.ఎమ్. ట్రస్టు ఇటీవల ఎన్‌టిఆర్ సేవా సమితి ట్రస్టుతో కలసి శనివారం తేది: స్థానిక కణితి రోడ్డులోని 63వ వార్డు వజ్ర భవనంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఉచిత వైద్య శిబిరాల ద్వారా ప్రజలు తమ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునే వీలు కలుగుతుందని, సకాలంలో వైద్యం పొందడానికి అవకాశం ఉంటుందని ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా అందించడమే లక్ష్యంగా ఎమ్‌పిఎమ్ ట్రస్టు ఉచిత వైద్య శిబిరాల నిర్వహణపై దృష్టి నిలిపిందన్నారు. కలుషిత వాతావరణం కారణంగా కంటి సమస్యలతో పాటు వివిధ రకాల రోగాలతో సతమతమవుతున్న స్థానికులు ఈ వైద్య సేవలు పొందాలన్నారు.ఈ శిభిరంలో మూత్రపిండాల సమస్యలు, స్త్రీలసమస్యలు, క్షయ, మోకాళ్ళలో ఆరుగుదల, గుండె జబ్బులకు, పరీక్షలు జరిపారు. గాజువాకలో నిర్వహించిన ఈ ఉచిత వైద్య శిభిరం ద్వారా స్థానికలలో అధికశాతం మంది కంటి సమస్యలు, వినికిడి సమస్యలతో బాధ పడుతున్నాట్లు వైద్యలు గుర్తించారు.



గీతం దంత వైద్య కళాశాల ఆసుపత్రి, జిమ్‌సర్ ఆసుపత్రి వైద్య నిపుణులు, పెద్ద ఎత్తున సిబ్బంది వైద్య శిబిరాలలో పాల్గొన్నారు. కాగా శనివారం 150 మందికి దంత పరీక్షలు, 100 మందికి కంటి వైద్య పరీక్షలు, 150 మంది స్త్రీ సంబంధిత పరీక్షలు, 150 మంది సాధారణ పరీక్షలు నిర్వహించినట్లు ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా రోగులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెలుగు దేశం నాయుకులు మహ్మద్ రఫీ, ట్రస్ట్ నిర్వాహకులు, లేళ్ళ కోటేశ్వర రావు, దేవారెడ్డి, దొడ్డి రమణ, పి.వి.రామారెడ్డి, శంకరావు, తదితరులు పాల్గొన్నారు.

# క్రీడా వికాస కేంద్రాల నిర్మాణాలు వేగవంతం చేయాలి

## జిల్లా కలెక్టర్ వివేక్ యాదవ్



విజయనగరం : క్రీడా వికాస కేంద్రాల నిర్మాణాలు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ వివేక్ యాదవ్ ఆదేశించారు. శనివారం మధ్యాహ్నం కలెక్టర్ కార్యాలయపు సమావేశ మందిరంలో క్రీడా వికాస కేంద్రాలు, తాటిపూడి వాటర్ స్పోర్ట్స్ అకాడమీ, విజ్జీస్టేడియంలో నిర్మించనున్న స్పోర్ట్స్ అకాడమీ, విజ్జీ స్టేడియంలో నిర్మించనున్న స్పోర్ట్స్ స్కూల్ నిర్మాణాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పోర్ట్స్ స్కూలు టెండరు ప్రక్రియ వేగంగా పూర్తి చేసి పనులు ప్రారంభించాలన్నారు. జిల్లాలో 51 క్రీడా మైదానాలు పూర్తయ్యాయన్నారు. రూ.13 లక్షల వ్యయంతో వాటర్ స్పోర్ట్స్ అకాడమీని అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ఈ సమావేశంలో డిఆర్ఓ ఆర్ఎస్ రాజ్‌కుమార్, సెట్విజ్ సిఇఓ ఎం.సత్యనారాయణ, డిఎఫ్ఓ లక్ష్మణ్, హార్టీకల్చర్ డిడి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

**మే5లోపు ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించకపోతే రద్దు :**

లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలు మే5వ తేదీలోగా నిర్మాణాలు ప్రారంభించకపోతే మంజూరు చేసిన ఇళ్లను రద్దు చేస్తామని జిల్లా కలెక్టర్ వివేక్ యాదవ్ స్పష్టం చేశారు. శనివారం గృహ నిర్మాణశాఖ, జాతీయ గ్రామీణ ఉపాదిహామీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్, మే నెలల్లో 10930 గృహ నిర్మాణాలు పూర్తి చేయాలని



ఆదేశించారు. 2017-18, 2018-19 సంవత్సరాలలో మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాల పురోగతిపై ఆరా తీశారు. ప్రతిరోజు 180 ఇళ్లు పూర్తి చేయాలన్నారు. డిఇలకు, ఎఇలకు లక్ష్యాలు నిర్దేశించాలని సూచించారు. హుద్‌హుద్ గృహ నిర్మాణాలపై సమీక్షించారు. లబ్ధిదారుల జాబితా సమర్పించాలని ఆదేశించారు. ఎపిటిడ్‌కో ద్వారా 11837 మంజూరు చేస్తే 4130 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించారని మిగిలిన ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన ప్రారంభించాలన్నారు. ఇళ్ల నిరామ్రణాలకు సకాలంలో బిల్లులు చెల్లించాలన్నారు. గృహ నిర్మాణాలు ప్రారంభించేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో గృహ నిర్మాణ శాఖ పథక సంచాలకులు మార్గరెట్ ధాచర్, డ్వామా పిడి బి.రాజగోపాల్, ఇఇలు రమణమూర్తి, పి.రఘురామ్, డిఇలు, ఎఇలు పాల్గొన్నారు.

## నేడు సంపతిపురంలో ఎఎన్ఆర్ వారి
# నూతన వెంచర్ ప్రారంభం



అనకాపల్లి : మండలంలోని సంపతిపురం గ్రామంలో పేద,మధ్యతరగతి వర్గాల ప్రజలకు అందుబాటు ధరలో ఇంటి సౌకర్యం కల్పించేందుకు ఎఎన్ఆర్ టౌన్‌షిప్ నూతన లే అవుట్ ఆదివారం ప్రారంభించనున్నట్లు సంస్థ చైర్మన్ అడబాల నారాయణమూర్తి తెలిపారు. సపంతిపురం గ్రామ పంచాయితీలో సుమారు 7న్నర ఎకరాల విస్తీర్ణంలో అన్నిరకాల వసతులతో నిర్మాణం ప్రారంభిస్తున్నామని అన్నారు. తమ సోదరుడు అడబాల పాండురంగారావు లతో కలిసి ఇదివరకే ఎల్ కోట మండలం సింగవరం, తణుకు, జంగారెడ్డి గూడెం తదితర చోట్ల వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్నామని అన్నారు.. ఆదివారం ఉదయం 11 గంటలకు జరుగు ఈ కార్యక్రమానికి అనకాపల్లి ఎంపి అవంతి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే పీలా గోవిందసత్యనారాయణ, మాజీ మున్సిపల్ చైర్మన్ కడిమిశెట్టి రాంజీ, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పిళ్లా నిర్మల లు హాజరవుతున్నారని తెలిపారు. ఈసమావేశంలో కశింకోట మండల మాజీ వైస్ ఎంపిపి వేగిగోపి, సంస్థ ప్రతినిధులు పిళ్లా అర్జునుడు, భీమ, రూప తదితరులు పాల్గొన్నారు.

## ఆయుష్మాన్‌భవ.. ఆరోగ్య పథకం ద్వారా
# రోగులకు మెరుగైన సేవలు

## యంపీ డాక్టర్ కంభంపాటి హరిబాబు




విశాఖపట్నంః తన సొంత నిధులతో రోగులకు సత్వర వైద్య పరీక్షలు, తద్వారా సమస్య పరిష్కారం సూచింపబడుతుందని విశాఖ యం.పి. డాక్టర్ హరిబాబు తెలిపారు. శనివారం తన సొంత నిధులు వెచ్చించి రోగుల కోసం సత్వర వైద్యం నిమిత్తం సుమారు 48 రకాల రక్త పరీక్షలు నిర్వహించేందుకు వీలుగా బయో కెమిస్ట్రీ ఎనలైజర్‌ను కొత్తగా కొని శనివారం ప్రారంభించారు. దీనిని ప్రభుత్వ ఛాతి, అంటువ్యాధుల ఆసుపత్రిలో దీనిని ప్రారంభించారు. ఈ సందర్భంగా యంపీ హరిబాబు మాట్లాడుతూ ఇక్కడి రోగులు నేటి నుంచి సుమారు 48 రకాల రక్త పరీక్షలు నిర్వహింపజేసుకొనవచ్చునని ఆయన తెలిపారు. ముందుగా హరిబాబు తన రక్తాన్ని పరీక్షింపజేసుకున్నారు. అత్యాధునికమైన ఈ పరికరం ద్వారా అందరూ రక్త పరీక్షలు చేయించుకుని ఆయురారోగ్యాలతో సుఖంగా ఉండాలని యంపీ కోరారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ చెస్ట్ ఆసుపత్రి అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిధిగా హాజరైన హస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ వర్కింగ్ చైర్మన్ ఆర్. రవి కుమార్ ప్రసంగిస్తూ అన్ని పాఠశాలలోనూ, ఆసుపత్రులలోనూ రోగులకు ఉచితంగా సరఫరా చేయటానికి తన సొంత నిధుల ద్వారా మెరుగైన పరికరాలను ఉచితంగా సరఫరా చేస్తున్నారని తెలిపారు. సభాధ్యక్షుడు డాక్టర్ సాంబశివరావు. సూపరింటెండెంట్ , చెస్ట్ ఆసుపత్రి ప్రసంగిస్తూ రోగులకు తమ ఆసుపత్రిలో వైద్యం అందిస్తున్నామని, ఇంకా కొన్ని అవసరమైన ఆసుపత్రి పరికరాలను కావాలి అన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి నర్స్, డాక్టర్లు, పి.జి. స్టూడెంట్స్, నర్సింగ్ స్టాఫ్ మరియు బిజెపి నేతలు కెశన కాంత్, ఆల్బర్ట్ రాజ్‌కుమార్, దుర్గ రాజు మొదలకు వారు పాల్గొన్నారు.

## బాలకృష్ణ నీకు మతి భ్రమించిందా
# ప్రధానిని విమర్శించడం తగదు



అచ్యుతాపురం: స్థాయిని మించి ప్రధానిని విమర్శించడం బాలకృష్ణ మతి భ్రమించిందని యలమంచిలి నియోజకవర్గ బిజెపి సమన్వయకర్త రాజాన సన్యాసినాయుడు ద్వజమెత్తారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ బావతో కలిసి తండ్రిని వెన్నుపోటు పొడిచి, అతని (ఎన్‌టిఆర్) మరణానికి కారణమైన నీవు ప్రదాన మంత్రిని విమర్శించడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని ఆరోపించారు. అదే విదంగా బెల్లంకొండపై కాల్పులు జరిపి అప్పటి కాంగ్రెస్‌లో ఉన్న పురందేశ్వరి (అక్క)ని అడ్డుపెట్టుకొని కేసులు మాఫీ చేసుకున్న నీవా ప్రదానిపై విమర్శించడమని ఆయన ఆగ్రహం వ్యక్తంచేసారు. ప్రతిపక్ష పార్టీలను శిఖండిగా పేర్కొంటూ విమర్శించడం అతని మానసిక పరిస్థితికి నిదర్శనమని ఎద్దేవ చేసారు. గతంలో మహిళల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయడం అందరికీ తెలిసిందేనన్నారు. మహిళలన్నా, కార్యకర్తలన్నా మర్యాద లేక వారి చెంప పగలగొట్టిన నీవా నీతి, నిజాయితీల గురించి మాట్లేడేదని దుయ్యబట్టారు. ఇలాంటి వారిపై కేసులు నమోదుచేసి, చట్ట సభల్లో ప్రవేశాన్ని నిషేదించాలని రాజాన డిమాండ్ చేసారు. ఇకపై ప్రధాన మంత్రిని గాని, బిజెపి నాయకులపై గాని అనుచిత వ్యాఖ్యలు చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుందని రాజాన సన్యాసినాయుడు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి గొంతిన భక్త సాయిరామ్, మండల అద్యక్షులు రాజాన రాజు తదితరులు పాల్గొన్నారు.

# నేడు జనసేన ఆత్మీయ సమావేశం



అచ్యుతాపురం: జనసేనా కార్యకర్తల ఆత్మీయ సమావేశానికి తరలిరావాలని యలమంచిలి నియోజకవర్గ జనసేన సేవాదళ్ కన్వీనర్ శెట్టి చిరంజీవి పిలుపునిచ్చారు. శనివారం ఆయన మాట్లాడుతూ యలమంచిలి గురప్పా కళ్యాణ మండపంలో ఆదివారం ఉదయం 9 గం॥లకు సమావేశం జరుగుతుందన్నారు. రాష్ట్ర జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఉత్తరాంధ్ర ఇన్‌ఛార్జ్ తమ్మిరెడ్డి శివ శంకర్ హాజరౌతున్న ఈ సమావేశంలో పార్టీ భవిష్యత్తు, కార్యాచరణపై మాట్లాడటం జరుగుతుందన్నారు. అదేవిదంగా దశా దిశా పార్టీ పటిష్ఠత గురించి కార్యకర్తలకు జరుగుతున్న అన్యాయంపై చర్చించడం జరుగుతుందన్నారు. కావున నియోజక పరిధిలో ఉన్న నాలుగు మండలాల కార్యకర్తలు, అభిమానులు, మహిళా కార్యకర్తలు హాజరు కావాలని శెట్టి చిరంజీవి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి జిల్లా జనసేన నాయకులు సతీష్, రాఘవ హాజరౌతున్నారన్నారు.

**మొదటి పేజీ తరువాయి**

## రెడ్‌క్రాస్ చేపడుతున్న కార్యక్రమాల్లో
# ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలి

దివ్యాంగులను ఆదుకోవాలని అన్నారు. వృద్ధులను రక్షించడమే కాకుండా మానవ సేవే మాధవసేవగా తలంచి వున్నత స్థానాన్ని పొందిన రెడ్ క్రాస్ సంస్థ సభ్యుల సేవలను కొనియాడారు. తాము చేపడుతున్న కార్యమ్రాలకు జిల్లా కలక్టర్లు, రెవెన్యూ అధికారులు సహాయ సహకారాలందించకుంటే మేము కార్యక్రమాలు చేయలేమని రెడ్‌క్రాస్ సభ్యులు చెప్పారు. ఈ సందర్భంగా ఎపి స్టేట్ ఐఆర్‌సిఎస్ చైర్‌పర్సన్ రేచల్ ఛటర్జీ మాట్లాడుతూ సభ్యులు అందరి సమిష్టి కృషి వలన జాతీయ స్థాయిలో ఈ సంస్థ సేవలు దినదినాభివృద్ధి చెందుతున్నాయని, ప్రజల మన్ననలు పొందుతున్నాయని అన్నారు. కుల, మత, లింగ బేధం లేకుండా మానవత్వమే ప్రధానంగా రెడ్‌క్రాస్ పని చేస్తోందని అన్నారు. నేటికి లక్షా 30 వేల మంది ప్రతినిధులతో ఈ సంస్థ నడుస్తోందన్నారు. సభ్యుల ప్రోత్సాహంతో మరిన్ని వినూత్న కార్యక్రమాలను రూపొందిస్తామన్నారు.

వెబ్సైట్ ప్రారంభం

ఈ సందర్భంగా రెడ్ క్రాస్ సంస్థ వెబ్‌సైట్‌ను గవర్నర్ నూతనంగా ప్రారంభించారు. ఈ సంస్థ చేపడుతున్న నూతన కార్యక్రమాలను ఈ వెబ్‌సైట్‌లో ఉంచాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం, కృష్ణా జిల్లాల కలెక్టర్లు ధనుంజయ రెడ్డి, లక్ష్మీకాంతం అవార్డులు అందుకున్నారు. విశాఖపట్నం కలెక్టర్ ప్రవీణ్ కుమార్ తరపున సంయుక్త కలెక్టర్ జి. సృజన అవార్డును అందుకున్నారు. ఐఎఎస్ అదికారులు, రెవెన్యూ, పంచాయితీరాజ్ అధికారులు ఇందులో ఉన్నారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ ముఖ్య కార్యదర్శి హర్‌ప్రీత్ సింగ్, ఐఆర్‌సిఎస్ ఎపి స్టేట్ జనరల్ సెక్రటరీ ఎస్. బాలసుబ్రహ్మణ్యం, జిల్లా కమిటీ చైర్మన్ పి. వేణుగోపాల్, పలు జిల్లాల చైర్మన్లు, సభ్యులు హాజరైనారు.

## బాలకృష్ణపై గవర్నర్‌కు భాజపా నేతల ఫిర్యాదు

విమర్శించేవారికి దోషులుగా చూపే ప్రయత్నం జరుగుతోందన్నారు. రాజకీయ విమర్శల్లోకి కుటుంబసభ్యులను లాగడం సరికాదన్నారు. అవినీతిని కప్పిపుచ్చుకునేందు చంద్రబాబు దీక్ష చేశారని మండిపడ్డారు. వ్యక్తిగత విమర్శలు చేసేవారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. పవన్ కల్యాణ్ ఆరోపణలపై నిజ నిర్ధారణ కమిటీ వేయాలని మాణిక్యాలరావు డిమాండ్ చేశారు.

## వైఎస్ జగన్‌కు జననీరాజనం

వారిగూడెం క్రాస్ మీదుగా యనమదలకు పాదయాత్ర చేరుకుంది. అనంతరం నూజివీడులోని చిన్న గాంధీ బొమ్మ సెంటర్‌కు చేరుకుని వైఎస్ జగన్ బహిరంగ సభలో పాల్గొంటారు. ఈ సభలో ప్రజలనుద్దేశించి జననేత ప్రసంగిస్తారు.

వైఎస్ జగన్ పాదయాత్ర బత్తులవారిగూడెం చేరుకుంది. వందల సంఖ్యలో గ్రామ ప్రజలు వైఎస్ జగన్‌కు ఘన స్వాగతం పలికారు. ప్రజాసంకల్పయాత్రలో భాగంగా వైఎస్ జగన్ యనమదలకు చేరుకున్నారు. ఆత్మీయ నేతకు ప్రజలు అడుగడుగునా బ్రహ్మరథం పడుతున్నారు.

## ఏపీ రాష్ట్రవ్యాప్తంగా తెదేపా సైకిల్ యాత్రలు

పెద్ద ఎత్తున పాల్గొంటున్నారు. విజయవాడ గ్రామీణం గొల్లపూడిలో సైకిల్‌యాత్రను జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ప్రారంభించారు. గ్రామ వీధుల్లో సైకిల్ తొక్కుతూ గ్రామస్థులకు అభివాదం చేశారు. రాష్ట్రానికి కేంద్రం చేసిన అన్యాయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలనే ఉద్దేశంతో సైకిల్ యాత్రను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విభజన హామీలు సాధించుకునేందుకు త్వరలో రాష్ట్రవ్యాప్తంగా మరిన్ని ప్రజాఉద్యమాలు చేపట్టనున్నట్లు మంత్రి దేవినేని చెప్పారు.

రాష్ట్రాన్ని విభజించి కాంగ్రెస్, విభజన హామీలను విస్మరించి భాజపా ఆంధ్రులను మోసం చేశాయని తెదేపా నేతలు వ్యాఖ్యానించారు. కృష్ణా జిల్లా పెనమలూరు నియోజకవర్గంలో నిర్వహించిన సైకిల్ యాత్రలో ఎంపీ కొనకళ్ల నారాయణ పాల్గొన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కర్నూలు జిల్లా వ్యాప్తంగా జనచైతన్య యాత్రలు ప్రారంభమయ్యాయి. నగరంలోని పాతకల్లూరు దర్వాజా నుంచి ద్విచక్రవాహన ర్యాలీని చేపట్టారు. తెదేపా జిల్లా అధ్యక్షుడు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు సైకిల్, ద్విచక్రవాహన, పాదయాత్రలు చేపట్టనున్నట్లు తెలిపారు. నేటి నుంచి 15 రోజులపాటు ఈ యాత్రలు సాగనున్నాయని తెలిపారు.

## ఐకమత్యంగా ఉండి, ముక్తకంఠంతో పోరాడాలి

పోరాడితే ఇవాళ కాకపోతే రేపైనా న్యాయం జరుగుతుంది. కేంద్రం చాలా అహంభావంతో ఉంది. విజ్ఞత కలిగిన నాయకుడిగా సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకున్నా. తప్పకుండా కేంద్రం దిగొచ్చేలా చేస్తాం. 40 ఏళ్ల అనుభవంలో చాలా రాజకీయాలు చూశా... నాలుగు సీట్లు తక్కువ వచ్చి ఉంటే మోదీ మన మాట వినేవారు. నాలుగేళ్లు రాత్రింబవళ్లు కష్టపడ్డాం. మరో పదేళ్లు కష్టపడితే దక్షిణాది రాష్ట్రాలతో సమానంగా ఎదుగుతాం. కేంద్రం సహకరిస్తే ఇంకా త్వరగా అభివృద్ధి చెందేవాళ్లం. పటేల్ విగ్రహానికి మోదీ రూ.2500 కోట్లుఇచ్చారు .. రాజధాని నిర్మాణానికి మాత్రం రూ.1500 కోట్లు ఇచ్చారు. అంటే ఒక విగ్రహానికి ఇచ్చిన డబ్బులు కూడా ఇవ్వలేదు. బంద్‌కు పిలుపు ఇచ్చి రాష్ట్రాన్ని ఆర్థికంగా దెబ్బతీయొద్దు. అలా చేస్తే పరోక్షంగా ప్రధాని మోదీకి సహకరించినట్లే అవుతుంది. రాష్ట్రం అంటే బాధ్యత లేదు కాబట్టే అఖిలపక్ష సమావేశానికి అన్ని సంఘాలు వచ్చినా పార్టీలు రాలేదు. లాలూచీ రాజకీయాలు ఉన్నాయి కాబట్టే కొన్ని పార్టీలు కూడగట్టుకుని రాలేదు. ప్రధాని ఎవరో తేల్చే శక్తి మనకొచ్చే సమయం ఎంతో దూరంలో లేదు. రాష్ట్రానికి ఏమీ చేయని భాజపాకు రాష్ట్రంలో ఒక్క ఓటు కూడా పడదు అని సీఎం వివరించారు.

# నేను ఇండియన్, హిందూ, మాదిగ క్రిస్టియన్‌ను కాదు

విశాఖపట్నం : టీటీడీ బోర్డు మెంబర్‌గా నియామకమైన పాయకరావుపేట ఎమ్మెల్యే వంగలపూడి అనిత నియామకాన్ని వ్యతిరేకిస్తూ వస్తున్న వార్తలపై అనిత స్పందిస్తూ తన నివాసంలో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీటీడీ బోర్డు మెంబర్ ఎంపికను రాజకీయం చేస్తున్నారని, హిందువును కాదని ఆధారాలు చూపితే దేనికైనా సిద్ధమని ఆమె సవాల్ విసిరారు. తాను వేంకటేశ్వర స్వామి, ఈశ్వరుడు తన ఆరాధ్య దైవాలని, భక్తురాలినని, హిందువునేనని చెప్పుకోవలసి వచ్చినందుకు బాధపడుతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. తనుపై ప్రతిపక్షాలు కుట్ర చేస్తున్నాయని, ప్రతిపక్షాలు చేస్తున్న అభివృద్ధి వ్యతిరేక కార్యకలాపాలను తాను వేలెత్తి చూపిస్తున్నందువలననే తనపై కక్షసాధింపు చర్యలు తీసుకుంటున్నారని ప్రతిపక్షాలపై మండిపడ్డారు. ఇది ముమ్మాటికీ మతతత్వ పార్టీలైన బిజెపి, వైకాపాల కుమ్మక్కేనని ఆమె అన్నారు. గతంలో మాట్లాడిన వీడియోను ముందు, వెనక కట్ చేసి వివాదం చేశారని అనిత ఆరోపించారు. రాష్ట్రఅభివృద్ధి, ప్రయోజనాల కోసం పాటుపడుతున్న టిడిపి పార్టీపై, చంద్రబాబు నాయుడుపై బురద జల్లేందుకే ప్రతీ చిన్న విషయాన్ని భూతద్దంలో చూపిస్తున్నారని అన్నారు. తాను వారంలో రెండు రోజులు అత్యంత నిష్ట నియమాలతో సోమవారం శివుణ్ని, శనివారం తన ఆరాధ్యదైవమైన వేంకటేశ్వర స్వామిని ఆరాధిస్తుంటానని ఆమె అన్నారు. తనకు పార్టీ టికెట్ కేటాయించిన తర్వాత తన నామినేషన్ పత్రాలను మొట్టమొదటి సారిగా తన నియోజకవర్గంలో ఉన్న ఉపమాక వేంకటేశ్వర స్వామి పాదాల చెంతనే ఉంచి, ప్రత్యేక పూజలు చేసుకుని వెంకన్న ఆశీస్సులు తీసుకున్నానని అన్నారు. నేను పక్కా భారతదేశంలో ఉన్న హిందూమాదిగనని ఆమె తన ధృవపత్రాలను మీడియాకు చూపించారు.టీటీడీ బోర్డులో ఎమ్మెల్యే అనితను నియమించడంపై పలు వర్గాల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.

తాను క్రిస్టియన్ అంటూ అనిత చెప్పిన వీడియోను ప్రభుత్వం పరిశీలించింది. దీంతో ఎమ్మెల్యే అనిత వ్యవహారంపై చంద్రబాబు అధికారులను నివేదిక కోసం ఆదేశించారు. నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామన్నారు. హిందూమత విశ్వాసాలకు ఏమాత్రం ఇబ్బంది లేకుండా నిర్ణయాలు ఉంటాయని చంద్రబాబు స్పష్టం చేశారు. కాగా టీటీడీ బోర్డులో మార్పులు ఉండే అవకాశం కనిపిస్తోంది. టీటీడీ కొత్త పాలక మండలి నియామకం పట్ల స్వామి పరిపూర్ణానంద అభ్యంతరం వ్యక్తం చేశారు. బోర్డు సభ్యుల్లో ఎమ్మెల్యే అనితను చేర్చడాన్ని ఆయన తప్పు పట్టారు. ఎమ్మెల్యే అనిత ఓ క్రిస్టియన్ అని.. వేరే మతస్తులను టీటీడీలో ఎలా సభ్యులుగా చేరుస్తారని ఆయన ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే అనిత తాను క్రిస్టియన్ అని స్వయంగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించిన విషయాన్ని ఆయన ఫేస్ బుక్ ఖాతాలో పోస్ట్ చేశారు. టీటీడీ నూతన పాలక మండలిలో ఓ క్రిస్టియన్ కి అవకాశం ఇవ్వడం ఏమిటి?.. ఇది ఏమి గ్రహచర్యం.. ఇది ఏమి న్యాయం?.. హిందువుల మౌనం చేతకానితనంగా భావిస్తున్నారా?.. ప్రశ్నించే సమయం ఆసన్నం అయింది' అని పరిపర్ణానంద వ్యాఖ్యానించారు.

# విజయభాను సంపాదకీయం

## వైవిధ్యభరిత పర్యటనలు

పురోగామి దేశాలుగా పేరొందిన నార్డిక్ నాయకులతో, సామ్రాజ్యవాద అవశేషంగా మిగిలిన కామన్వెల్త్ నేతలతో సమావేశాలు జరిపిన ప్రధాని మోదీ యూరప్ పర్యటన వైవిధ్యభరితమైంది. ప్రపంచీకరణ ఒత్తిడులకు గురవుతున్న తరుణంలో నార్డిక్ దేశాలైన నార్వే, స్వీడన్, డెన్మార్క్, ఫిన్‌లాండ్, ఐస్‌లాండ్ దేశాల పర్యటన వల్ల భారత సంబంధాలు మరింత విస్తారం గా బలపరుచుకున్నట్టయింది. మరోవైపు బ్రిటన్ వేదికగా జరిగిన కామన్వెల్త్ ప్రభుత్వాధినేతల సమావేశం కూడా ఒకప్పటి బ్రిటిష్ సామ్రాజ్యంలోని దేశాలతో సంబంధాలను పటిష్టం చేసుకోవడానికి దోహదపడింది. సామాజికాభివృద్ధిలో, ప్రజాస్వామిక సంస్కృతిలో నార్డిక్ దేశాల తో నేర్చుకోవలసింది ఎంతో ఉన్నది. ఈ నేపథ్యంలో మోదీ పర్యటన ఎంతో ఉపయోగపడుతుంది. ఇందుకు భిన్నంగా కామన్వెల్త్ దేశాలు తమ అధినేతగా బ్రిటిష్ రాణి తరువాత ఆమె కుమారుడు ప్రిన్స్ చార్లెస్‌ను తమ కూటమికి అధినేతగా అంగీకరించడం అభ్యంతరకరం. ఒకప్పుడు బ్రిటిష్ సామాజ్యంలోని వలసలతో కూడిన సమావేశాలు జరిగేవి. వలసలు స్వతంత్రం పొందడంతో ఈ సామ్రాజ్య సమావేశాలు క్రమంగా కామన్వెల్త్ ప్రభుత్వాధినేతల శిఖరాగ్ర సమావేశంగా మారింది. కానీ పాత పద్ధతిలో ఈ కూటమి అధినేతగా బ్రిటిష్ రాణి కొనసాగుతున్నది. అస్వస్థత వల్ల ఇతర దేశాలలో ఈ కూటమి సమావేశాలకు ఆమె హాజరు కాలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో ఆమె వైదొలిగినప్పుడు వారసుడిగా ఆమె కుమారుడికి ఇవ్వకుండా, వంతుల వారిగా వివిధ దేశాధినేతలకు కూటమి నేతృత్వం అప్పగించాలనే డిమాండ్ ముందుకు వచ్చింది. కానీ ఈ డిమాండ్‌ను ఆమోదించక పోవడం కామన్వెల్త్ దేశాల బలహీనతను వెల్లడిస్తున్నది. కామన్వెల్త్ దేశాలతో పోలిస్తే నార్డిక్ దేశాలతో సమావేశం కొత్తది. నార్డిక్ దేశాలతో భారత్ సమావేశం కావడం ఇదే మొదటిసారి. పారిశ్రామిక దేశాలను అభివృద్ధి చెందిన దేశాలనే భావన ఉన్నది. కానీ పారిశ్రామికాభివృద్ధితో పాటు సామాజిక అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వడం నార్డిక్ దేశాల ప్రత్యేకత. సామాజికాభివృద్ధి, సామాజిక సంబంధాలలో ప్రజాస్వామ్యస్ఫూర్తిని ఈ దేశాల నుంచి నేర్చుకోవలసి ఉన్నది. విద్యా రంగం లో కూడా డెన్మార్క్ గురించి ప్రపంచానికే ఆదర్శ ప్రాయమైందిగా చెప్పుకుంటారు. స్వీడన్ వంటి దేశాలలో పారిశ్రామిక సంస్థల నిర్వహణ, విధాన నిర్ణయాల్లో ఉద్యోగుల భాగస్వామ్యం ఉంటుంది. అందువల్ల భారత్ నార్డిక్ దేశాలతో సంబంధాలను వాణిజ్యానికే పరిమితం చేయకుండా మరింత విస్తారంగా సాగించాలె. కొత్త ఆవిష్కరణలలో కూడా ఈ దేశాలు ముందున్నాయి. అందుకే ప్రధా ని మోదీ పర్యటన సందర్భంగా పబ్లిక్ ప్రైవేటు రంగం, అకడమిక్ రంగాల సంబంధాల చర్చ సాగింది. మేక్ ఇన్ ఇండియా విధానానికి అనుగుణంగా పెట్టుబడులను ప్రధాని ఆహ్వానించారు. ఈ క్రమంలో ఇక్కడి నైపుణ్యాభివృద్ధికి నార్డిక్ దేశాల తోడ్పాటు లభిస్తుంది. పర్యావరణ హితమైన సాంకేతిక పరిజ్ఞానం, ఫుడ్ ప్రాసెసింగ్‌తో సహా వ్యవసాయరంగంలో నార్డిక్ దేశాల సహకారం అందించడానికి చర్చలు సాగాయి. ఇప్పటి వరకు నార్డిక్ దేశాలతో సంబంధాలు ఉన్నప్పటికీ, ఆ దేశాల శక్తి సామర్థ్యాలను పూర్తిగా ఉపయోగించుకోవడంపై శ్రద్ధ కనబరుచలేదు. ప్రధాని మోదీ పర్యటనతో కొత్త శకం ప్రారంభమైందని చెప్పవచ్చు. అయితే ప్రభుత్వాల మధ్య సంబంధాల కన్నా ఇక్కడి సమాజం, పరిశ్రమలు అక్కడి పరిశ్రమలు, ఆవిష్కరణలు మొదలైన రంగాలలో నెలకొన్న సంస్కృతిని ఎంతగా ఆకళింపు చేసుకుంటాయనేది కూడా ప్రధానమే. బ్రిటన్ ఇప్పటి వరకు యూరప్ దేశాలతో వాణిజ్య సంబంధాలకే ప్రాధాన్యం ఇచ్చింది. బ్రిట న్ మొత్తం వాణిజ్యంలో దాదాపు సగం మిగతా యూరోపియన్ దేశాలతో సాగుతున్నది. కామన్వెల్త్ దేశాల భాగస్వామ్యం చాలా తక్కువ. బ్రిటన్ యూరోపియన్ యూనియన్ నుంచి వైదొలుగడం నేపథ్యంలో కామన్వెల్త్ దేశాలపై దృష్టి సారిస్తున్నది. ఇటీవలి కాలంలో కామన్వెల్త్ సమావేశాలకు భారత ప్రధాని హాజరుకావడం లేదు. కానీ ఈసారి ప్రత్యేకించి రాణి అభ్యర్థించడం, ప్రిన్స్ చార్లెస్ తన పర్యటన సందర్భంగా ఆహ్వానించడం వల్ల మోదీ హాజరైనట్టు చెబుతున్నారు. కానీ యాభైకి పైగా కామన్వెల్త్ దేశాలతో సంబంధాలను పెంచుకోవాలనే ఆసక్తిని భారత్ ప్రదర్శిస్తున్నది. చైనా ప్రాబల్యం విస్తరిస్తున్న నేపథ్యంలో ఆసియా, ఆఫ్రికా దేశాలలో పట్టు కోసం భారత్ ఈ వేదికను ఉపయోగించు కుంటున్నది. ఇదే విధంగా అమెరికా వాణిజ్య రక్షిత విధానాలను అనుసరిస్తున్నందు వల్ల భారత్ నార్డిక్ దేశాలతో సంబంధాలను పెంచుకుంటున్నది. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో భారత్ సభ్యత్వానికి నార్డిక్ దేశాలు మద్దతు ప్రకటించాయి.

## ఏకంగా మనుషులపైనే ప్రయోగించారు...



బిడసర్: విదేశాలకు చెందిన ఓ ఫార్మా కంపెనీ జంతువులపై ప్రయోగించి పరీక్షించాల్సిన తమ ఔషధాన్ని రాజస్థాన్‌లోని కొందరు కూలీలపై ప్రయోగించింది. దీంతో వారు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. బాధితులు ప్రస్తుతం చురు జిల్లా కేంద్రంలోని జల్పాని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. రోజుకి రూ.500 ఇస్తామంటూ సదరు కంపెనీ బాధితులను తీసుకొచ్చినట్లు తెలుస్తోంది.

బాధితుల్లో ఓ వ్యక్తి మీడియాతో మాట్లాడుతూ మేము ఇక్కడికి ఏప్రిల్ 18న వచ్చాం. వారు మాకు డబ్బులిస్తామని చెప్పడంతో ఈ పనికి వచ్చాం. మొత్తం 21 మందిలో 16 మంది అనారోగ్యానికి గురయ్యాం. దీంతో మమ్మల్ని ఆసుపత్రికి తరలించారు. అని పేర్కొన్నారు. తమపై సదరు మందు ప్రయోగించాక నిద్రలోకి జారుకున్నామని మరో బాధితుడు వెల్లడించారు. ఘటన సమాచారం తెలుసుకున్న రాజస్థాన్ ఆరోగ్య శాఖ మంత్రి కాళీ చరణ్ సరఫ్ స్పందించారు. సదరు ఘటనపై వివరాలు తెలుసుకుంటానని చెప్పారు. ఇప్పటికే విచారణకు ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు.

## దేశమంతా నగదు కొరత.. కర్ణాటకలో నోట్లవరద


దిల్లీ: నగదు కొరతతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లోని ప్రజలు గత కొన్ని రోజులుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎన్ని ఏటీఎంలు తిరిగినా నో క్యాష్ బోర్డులే దర్శనమిస్తున్నాయని వాపోతున్నారు. ఇలా దేశంలో చాలా చోట్ల కరెన్సీ కొరత ఉండగా.. కర్ణాటకలో మాత్రం పెద్ద నోట్లు భారీ ఎత్తున చేతులు మారుతున్నాయి.

కర్ణాటకలో మరికొద్ది రోజుల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఇటీవల ఆదాయపు పన్ను శాఖ అధికారులు పలు చోట్ల సోదాలు చేపట్టారు. ఈ సోదాల్లో ఇప్పటివరకు రూ. 4.13కోట్లు నగదును స్వాధీనం చేసుకోగా.. ఇందులో 97శాతం రూ. 2000, రూ. 500 నోట్లే ఉన్నాయట. ఈ మేరకు సంబంధిత అధికారులు వెల్లడించారు. ఇటీవల కర్ణాటకలో చేపట్టిన సోదాల్లో రూ. 4.13కోట్ల నగదు, రూ. 1.32కోట్ల విలువ బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నాం. ఈ నగదు మొత్తంలో రూ. 2000, రూ. 500లు అన్నీ కలిపి రూ. 4.03కోట్లు ఉన్నాయి అని ఐటీశాఖ తెలిపింది.

మే 27న కర్ణాటక ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నాటి నుంచి ఇప్పటివరకు చేపట్టిన సోదాల్లో ఈ నగదును జప్తు చేశారు. ఇందులో అత్యధికంగా బెంగళూరులో రూ. 2.47కోట్లు, ఆ తర్వాత బళ్లారిలో రూ. 55లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఇటీవల ఎయిర్‌పోర్ట్‌లో అనుమానాస్పదంగా కన్పించిన ఓ వ్యక్తిని తనిఖీ చేయగా.. అతడి వద్ద రూ. 16.5లక్షలు గుర్తించాం. ఆ తర్వాత అతడిని విచారించగా.. ముంబయి పరిసర ప్రాంతాల్లో మరో 37లక్షలు చేతులు మారినట్లు తెలిసింది అని అధికారులు వెల్లడించారు.

ఓవైపు కొన్ని ప్రాంతాల్లో నగదు కొరత ఏర్పడగా.. ఇదే సమయంలో కర్ణాటకలో భారీ ఎత్తున కరెన్సీ లభించడం కలకలం సృష్టిస్తోంది. దీంతో అప్రమత్తమైన అధికారులు ఆ డబ్బు ఎక్కడి నుంచి తీసుకొస్తున్నారనే దిశగా దర్యాప్తు చేస్తున్నారు. ఎయిర్‌పోర్టులు, రైల్వే స్టేషన్లలో నిఘా పెట్టినట్లు చెప్పారు.

## రాజకీయాల నుంచి తప్పుకుంటున్నా:యశ్వంత్ సిన్హా



పట్నా: కేంద్ర మాజీ మంత్రి, భాజపా సీనియర్ నేతగా ఉన్న యశ్వంత్ సిన్హా సంచలన నిర్ణయం తీసుకున్నారు. రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్టు ప్రకటించారు. ఈ రోజు నుంచి రాజకీయ సన్యాసం స్వీకరిస్తున్నట్టు వెల్లడించారు. దీంతో పాటు భాజపాతో ఉన్న అన్ని బంధాలకు ముగింపు పలుకుతున్నట్టు తెలిపారు. గతంలో సిన్హా కేంద్ర ఆర్థిక మంత్రిగా పనిచేశారు. గత కొంతకాలంగా భాజపా పట్ల అసంతృప్తిగా ఉన్న 80ఏళ్ల ఆయన ఈ రోజు బిహార్‌లోని పట్నాలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ భాజపాతో తన అనుబంధాన్ని తెంచుకుంటున్నట్టు వెల్లడించారు. అయితే తాను ఇక ఏ పార్టీలోనూ పనిచేయనని, రాజకీయ సన్యాసం తీసుకుంటున్నానని అన్నారు. సిన్హా ఏర్పాటు చేసిన రాష్ట్ర మంచ్ సమావేశంలో ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్, రాష్ట్రీయ జనతా దళ్ నేతలతో పాటు మరో అసంతృప్త భాజపా నేత శత్రుఘ్న సిన్హా కూడా ఉన్నారు.

భాజపాకు వ్యతిరేక కూటమి ఏర్పాటు చేసేందుకు యశ్వంత్ సిన్హా కొద్ది రోజుల క్రితం రాష్ట్ర మంచ్‌ను ఏర్పాటు చేశారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. భాజపా వ్యతిరేక పార్టీలతో మూడో ఫ్రంట్ ఏర్పాటు చేసే విషయంపై ఏప్రిల్ 21న జరిగే సమావేశంలో రాజకీయ కార్యాచరణ తెలియజేస్తానని చెప్పిన సిన్హా రాజకీయ సన్యాసం తీసుకుంటానని ప్రకటించడం గమనార్హం. యశ్వంత్ సిన్హా కుమారుడు జయంత్ సిన్హా ప్రస్తుతం ప్రధాని మోదీ క్యాబినెట్‌లో మంత్రిగా ఉన్నారు. ఈ రోజు పట్నాలో యశ్వంత్ సిన్హా ఏర్పాటు చేసిన సమావేశానికి పలువురు కాంగ్రెస్ నేతలు, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ దినేశ్ త్రివేది, ఆర్జేడీకి చెందిన తేజస్వి యాదవ్, జయంత్ చౌదరి, ఆప్‌కు చెందిన సంజయ్ సింగ్, సమాజ్ వాదీ పార్టీ నేత ఘనశ్యామ్ తివారీ తదితరులు హాజరయ్యారు.

## అమిత్ షా సభలో స్వల్ప అగ్ని ప్రమాదం...

రాయ్‌బరేలీ : భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు అమిత్ షా శనివారం రాయ్‌బరేలీలో నిర్వహించిన బహిరంగ సభ వద్ద స్వల్ప అగ్ని ప్రమాదం సంభవించింది. దీంతో సభలో పాల్గొన్న ప్రజలు ఆందోళనకు గురయ్యారు. కొద్ది సేపటికే ఈ అగ్ని జ్వాలలను అదుపు చేశారు. సభలో ఏర్పాటు చేసిన మీడియా ఎన్‌క్లోజర్ వద్ద షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం సంభవించినట్లు అధికారులు చెప్పారు.

ఈ సంఘటన జరిగినపుడు అమిత్ షాతో పాటు ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వేదికపై ఆసీనులై ఉన్నారు. ఉత్తర ప్రదేశ్ బీజేపీ అధ్యక్షుడు మహేంద్రనాథ్ పాండే ప్రసంగిస్తున్నపుడు ఈ దుర్ఘటన జరిగింది.

## కవి సమయం

### 'పూ దండ'

ఎమందో... ఎమందో!
ఎం చెయ్యి నున్నదో!
వాలే పువ్వు ఎమందో!
సిగలో వాలే పువ్వు ఎం చెయ్యినున్నదో!
సువాసనలతో మత్తెకించాలనినున్నదో!
కైపెక్కించనున్నదో!
ముద్దులతో ముంచెయ్యాలనినున్నదో!
...!!ఎమందో!!
నును మెత్తని రెప్పలలో
లోలోపల దాగిఉన్న
మకరంధం యివ్వాలనినున్నదో!
రిఫరిఫమన్న యవ్వన క్రాంతులు
రంగరించాలనినున్నదో!
...!!ఎమందో!!
కైపెక్కించే ముద్దులతో
వాడివాలి రాలాలని నున్నదో!
పూదండలోని దారమంతా
బట్టబైలుచేనున్నదో
చిందర వందర పొన్నుగచేనున్నదా
జరిగింది తల్చుకొని
సిగ్గు తెరలు కప్పుకొని
నల్లబారి ఉండాలనినున్నదో!
...!!ఎమందో!!

·· రచన : ఎల్.సిద్ధు
సెల్ నెం:7702977293

## పంచాంగం

మాసం : ఛైత్ర ; తిథి : సప్తమి సా.6.23; పునర్వసు రా.8.22; ఉ.వ.9.11ల 10.40; తె.వ.3.49ల 5.19.

ఆదివారం 22-04-2018

a **మేషం** : మీ శక్తికి మించిన పనులు చేయుట వలన ధనవృద్ధి కలుగును. వడ్డీ వ్యాపారస్థులకు లాభం. కుటుంబ కలతలు అంతరించును. మానసిక ఆందోళన తగ్గును. గౌరవ మర్యాదలకు లోటురాదు. చేతి పనులు కలిసివచ్చును. పీచు, లెదర్, హోమ్ వ్యాపారస్తులకు సంతృప్తి, అభివృద్ధి కానవస్తుంది. తోటివారితో అను బంధాలు బలపడతాయి. సోదరీ, సోదరుల భావం అధికమవుతుంది.

b **వృషభం** : స్త్రీలకు పరిచయాలు వ్యాపకాలు అధికమవుతాయి. ఆధ్యాత్మిక, దైవ, సేవా కార్యక్రమాలపట్ల ఆసక్తి పెరుగుతుంది. మీ బాధ్యతలు ఇతరులకు అప్పగించవద్దు. ఎంత సంపాధించినా ధనం నిలబెట్టలేకపోతారు. మీ ప్రత్యర్థుల విషయంలో అప్రమత్తంగా మెలగండి. సహోద్యోగులు మనసు తెలిసి వ్యవహరిస్తారు.

c **మిథునం** : రాజకీయనాయకులు సభలు, సమావేశాల్లో అందరినీ ఆకట్టు కుంటారు. రుణాలు తీరుస్తారు. హోటల్, తినుబండారాలు, క్యాటరింగ్ పనివార లకు పనిభారం అధికమవుతుంది. ఒక వ్యవహారం నిమిత్తం ఆకస్మికంగా ప్రయాణం చేయవలసి వస్తుంది. నిరుద్యోగులు చేపట్టిన ఉపాధి పథకాలు సంతృప్తికరంగా సాగుతాయి. వైద్యులు శస్త్రచికిత్స చేయునపుడు ఏకాగ్రత అవసరం.

d **కర్కాటకం** : ఆహార వ్యవహారాలలో మెళుకువ వహించండి. ఉద్యోగస్తులకు పై అధికారుల నుంచి మంచి గుర్తింపు, రాణింపు లభిస్తుంది. స్త్రీలకు పనివారలతో ఒత్తిడి, చికాకులను ఎదుర్కొంటారు. మీ యత్నాలకు సన్నిహితుల ప్రోత్సాహం, సహకారం అందిస్తారు. ఖర్చులకు సరిపడు ఆదాయం సమకూర్చుకుంటారు. గత కొంతకాలంగా మీరు అనుభవిస్తున్న ఒత్తిళ్లు, చికాకులు క్రమంగా తొలగిపోతాయి.

e **సింహం** : ఉపాధ్యాయ రంగాలలో వారికి అభిప్రాయబేధాలు తలెత్తవచ్చు జాగ్రత్త వహించండి. ఏ పని మొదలుపెట్టినా మధ్యలో వదిలేయకుండా పూర్తి చేయండి. వస్త్ర వ్యాపారులు పనివారలను ఓ కంటకనిపెట్టుకుని ఉండటం శ్రేయస్కరం. నిరుద్యోగు లకు తాత్కాలిక అవకాశాలు లభిస్తాయి. పుణ్యక్షేత్రాలను దర్శించు కుంటారు. నిత్యావసర వస్తు వ్యాపారులకు, స్టాకిస్టులకు కలసిరాగలదు.

f **కన్య** : స్థిరాస్తి క్రయ విక్రాయాల్లో ప్రముఖుల సలహా పాటించటం మంచిది. కష్టమైన పనులన్నింటిని దిగ్విజయంగా పూర్తిచేస్తారు. ఉద్యోగస్తులు ఒత్తిళ్ళు, ప్రలోభాలకు దూరంగా ఉండటం మంచిది. కుటుంబీకులు మీ అభిప్రాయాలతో ఏకీభవిస్తారు. కొబ్బరి, పండ్ల, పూల, కూరగాయలు, చిరు వ్యాపారులకు పురోభివృద్ధి.

g **తుల** : కందులు, ఎండుమిర్చి, స్టాకిస్టులు, వ్యాపారస్తులు సంతృప్తి కానవస్తుంది. రవాణా రంగాలలో వారికి మిశ్రమ ఫలితం కానవస్తుంది. రచయితలకు, పత్రికా రంగంలో వారికి కీర్తి, గౌరవాలు పెరుగుతాయి. ప్రేమానుబంధాలు బలపడతాయి. రాజకీయాల్లో వారికి తెలివితేటలకు మంచి గుర్తింపు లభిస్తుంది.

h **వృశ్చికం** : కోళ్ళ, గొఱ్ఱె, పాడి పరిశ్రమ రంగాలలో వారికి పురోభివృద్ధి కానవస్తుంది. ఖర్చులకు సరిపడు ఆదాయం సమకూర్చుకుంటారు. ఒక కార్యం నిమిత్తం ప్రయాణం చేయవలసి వస్తుంది. మీ సంతానం భవిష్యత్తు గురించి కొత్త పథకాలు వేస్తారు. స్త్రీలను గృహంలో ఒక శుభకార్యం చేయాలనే ఆలోచన స్ఫురిస్తుంది.

i **ధనుస్సు** :తలపెట్టిన పనులు విజయవంతంగా పూర్తి చేస్తారు. కోర్టు వ్యవహారాల్లో ప్లీడర్ల ధోరణి ఆందోళన కలిగిస్తుంది. రచయితలకు, పత్రికా రంగంలోని వారికి కీర్తి, గౌరవం పెరుగుతాయి. మిత్రులను కలుసుకుంటారు. సోదరీ, సోదరులతో ఏకీభవించలేరు. ఉద్యోగస్తులు అధికారులతో సంభాషించునప్పుడు మెళుకువ అవసరం.

j **మకరం** : బ్యాంకు వ్యవహారాలలో అపరిచిత వ్యక్తులపట్ల అవసరం. పెద్దల ఆరోగ్యము గురించి ఆందోళన చెందుతారు. గృహమునకు కావలసిన వస్తువులను కొనుగోలు చేస్తారు. ప్రైవేటు సంస్థలలోని వారికి పనిభారం అధికమవుతుంది.

k **కుంభం** : యోచనతో మసలుట మంచది. మీ మాటకు వ్యతిరేకత ఉండును. మధ్యవర్తిత్వం వహించుట మంచిదికాదు. రియల్ ఎస్టేట్ రంగంవారికి సామాన్యం. ఆరోగ్యం విషయమందు జాగ్రత్త అవసరం. ఔషధ సేవ చేస్తాను. దీర్ఘరోగులకు తగు జాగ్రత్త అవసరం.

L **మీనం** : ఆ ప్రయాణములయందు జాగ్రత్త అవసరం. వ్యవహార అనుకూలం. రావలసిన ధనం వస్తుంది. ఖర్చులు అధికం. ఒక కార్యం నిమిత్తం ప్రయాణం చేస్తారు. పత్రికా సంస్థలలోని వారికి ఊహించని సమస్యలెదురవుతాయి. దంపతుల మధ్య చిన్న చిన్న కలహాలు, చికాకులు తప్పవు. కోర్టు వ్యవహారాల్లో కొంత పురోగతి కనిపిస్తుంది. డాక్టర్లు అరుదైన చికిత్సలు విజయవంతంగా పూర్తిచేస్తారు. సభలు, సమావేశాల్లో చురుకుగా పాల్గొంటారు.

# ఆత్మ సాక్షాత్కారం


ఆత్మ సాక్షాత్కారం పొందిన మహాత్ముల స్థితి ఎట్లా వుంటుందో, తక్కినవారు గ్రహించలేరు. విచక్షణతో చూస్తే ఈ విభేదమంతా వారు వారు కల్పించుకున్నది కాదనీ, వారి మాటల, చేతల, ప్రోద్బలమంతా ఈశ్వర చోదితమని తెలుస్తుంది. అరుణాచల శ్రీరమణ భగవాన్ జీవితంలో భక్తులకు, మేధావులకు, ఆధ్యాత్మిక సంపన్నులకు కూడా ఎన్నో విషయాలు అర్థం కావు. ఆయన ఈ సమాజంలోని ఈ ద్వంద్వాలు దాటిన మహర్షి అనీ, సర్వేశ్వరుడే అని నమ్మినవారినీ, నమ్మనివారికి కాని భగవాన్ ఏ మనిషికి, ఏ పరిస్థితులలో ఏ విధంగా మాట్లాడుతారో, ఏవిధంగా బోధనలు చేస్తారో అంతుపట్టని విషయం.

**అర్థం కాకుంటే అంధకారమే:**

శ్రీరమణాశ్రమంలో భగవాన్ చుట్టూ జరిగే వాటిలో ఆయనకు ఎంత సంబంధంవుందో చెప్పలేం. సంబంధం వుండనూ వుంది, ఉండనూ లేదు. ఉందంటే వుంది, లేదంటే లేదు. శ్రీరమణ మహర్షి ఆశ్రమంలో తరుచూ జరిగే లోపాలు, పక్షపాతాలు, ఘోరాలు అన్యాయాల్ని ప్రశ్నించిన భక్తుల్ని ఒక్కోసారి సుతిమెత్తగా మరోసారి మేఘ గర్జనగల భీర స్వరంతో మీరు ఆశ్రమాన్ని సంస్కరించడానికి వచ్చారా? ఈ మాత్రం దానికి అంత దూరం నుండి రావడం దేనికి? మీమీ దేశాలలో సంస్కరించడానికి ఏమీ లేవా? మీరు వచ్చిన పని ఏదో చూసుకొని వెళ్లరాదా? అంటూ భగవాన్ నర్మగర్భంగా ప్రశ్నిస్తే ఆయనను అర్థం చేసుకొన్న వారు మహాగీతో పనిషత్తుగా భావించి నమస్కరించేవారు. అర్థంకానివారు అంధకారంలో పడి తమను తామూ సమర్థించుకొంటూ తమ మార్గమే సరైన మార్గమని అహంభావం ప్రదర్శించేవారు.

**స్వాప్నిక దృష్టి:**

తాను మనసారా విశ్వసించని విషయాన్ని కూడా భక్తుల వత్తిడితో సరే అని ఆమోదించేవారు. ఆదరించి, ఆశ్రయం కల్పించాల్సిన భక్తులను స్వాప్నిక దృష్టితో కలల్లో కనబడి రమ్మంటారు. భగవాన్ పిలుపుకు ఆగలేని ఆతృతా, ఎప్పుడు దర్శన భాగ్యం కలుగుతుందా అని సుదూర ప్రాంతాలనుంచి పరుగు పరుగున దరిచేరితే భాగవాన్ ఆత్మీయతతో ఆదరించి కరుణారసం కురిపిస్తాడని ఆశిస్తే భగవాన్ అటువైపు కూడా తల తిప్పని పరిస్థితి. ఎదుట వున్నా పలుకరించని పరిస్థితి. ఆతురతతో ఎదురుచూసిన భక్తుని పలుకరించరు. చిరునవ్వు నవ్వరు. కొన్ని రోజులైనా నెలలయిన అతని కోసం అహర్నిశలూ ఆత్రతతో ఎదురుచూస్తున్నా పలుకరించరు?



అనుగ్రహించరు? భగవాన్ ఎప్పుడు అక్కున చేర్చుకుంటారో? అసలు పట్టనట్లే ఆవలకు నెట్టివేస్తాడో అంతా ఈశ్వరేచ్ఛ. భగవాన్ వైఖరి ఎప్పటికప్పుడు మారేది. ఆయన ఏ ఆనంద నిబిడీకృతమైన తేజోశూన్యంలోకో, కిటికీలోనుంచి అనంతపు దిక్కుల అంచుల్ని దాటి చూస్తున్నప్పుడు, ఆయన ధ్యాన ముద్రలో కూర్చున్నప్పుడు సాక్షాత్ దక్షిణామూర్తిని తలపించేవారు. భక్తులు ఆ దివ్యానంద స్థితిని పరికించి అరుణాచల పరమేష్టి ఆత్మసాక్షాత్కారం కళ్ళకు అగుపించేది.

## సంకీర్తన

**అదియే ఆత్మసాక్షాత్కారం:**

మృత్యువువాతన పడిన దేహాన్ని కాల్చి బూడిద చేస్తారు. అంతటితో అంతవరకు నిత్యం అనుసరిస్తున్న నేను అనేది అంతమైనట్లేనా? నేను అనేది అనంతంగా సాక్షాత్కరిస్తుంటే ఆ నేను ఎవరో తెలుసుకో. నేను, నాది అనే విషయాన్ని విస్మరించు. నేను అనే బ్రహ్మపదార్థాన్ని తెలుసుకోవడమే ఆత్మ సాక్షాత్కారం.

కనుక నేను అనేది ఈ దేహంకాదు. నాకు మృత్యువు లేదు అని భావించేటప్పటికి అతనికి జ్ఞానోదయమయింది. నేను అనేది మనసు ఆలోచన కాక, అది అనుభవమైపోయింది. మన మనసుగాక మనలో ఆత్మ అనేది వుందనీ, ఆ ఆత్మను తలచుకుంటే మనకింక బాధలుండవనీ నేనెవరు? అనే విచార మార్గం వల్ల ఆ ఆత్మని తెలుసుకోగలమనీ భగవాన్ అంటారు.

**మనసు లగ్నం చేయడమే సాక్షాత్కారం:**

శ్రీరమణ మహర్షి ఆశ్రమానికి ఒక భక్తుడు వెళ్ళారు. భగవాన్‌ను ఉద్దేశించి స్వామీ! నా మనస్సు నేను చెప్పినట్టు దాని ఇష్టం వచ్చినట్లు విచారిస్తోంది.

రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
Minimum 7 days
విజయభాను క్లాసిఫైడ్స్
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

## పింఛన్లకు దరఖాస్తు చేయించండి

నాతవరం : వికలాంగ పింఛన్లకు సదరం దృవపత్రం ఉన్నవారంతా దరఖాస్తులు చేసుకోవాలని ఎంపిడిఒ లోకుల యాద గిరీశ్వరరావు కోరారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండలానికి 95 సదరం దృవపత్రాలు వచ్చాయన్నారు. వీరంతా పింఛను పొందేందుకు అర్హులన్నారు. దీనిపై గ్రామాల్లో దండోరా వేయించి దివ్యాంగులకు అవగాహన కల్పించాలని గ్రామ కార్యదర్శులను ఆదేశించామని చెప్పారు. ఈ విషయంలో ప్రజాప్రతినిధులు దివ్యాంగులకు అవగాహన కల్పించాలని కోరారు.

## నేటి నుంచి కొమరవోలమ్మ తల్లి జాగరణ ఉత్సవాలు

రోలుగుంట : కొమరవోలు గ్రామానికి చెందిన కొమరవోలమ్మ తల్లి జాగరణ ఉత్సవాలు ఆదివారం నుంచి జరగనున్నాయి. ఈ మేరకు ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేస్తోంది. 22న గంగాదేవి ఉత్సవంతో జాతర ప్రారంభమవుతుంది. 24న పరదేశమ్మ ఉత్సవం, 25న రాత్రి నుంచి కొమరవోలమ్మ తల్లి జాగరణ ప్రారంభమవుతుంది. 26న సాయంత్రం నుంచి తప్పెటగుళ్లు, చిడతల భజనలు, డ్యాన్సులు, నేలవేషాలు, శక్తి వేషాలతో అమ్మవారి సంబరం చేస్తారు. అదే రోజు రాత్రి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు భరతనాట్యం, పలు సాంఘిక నాటకాల ప్రదర్శన, బాణసంచా కాల్చివేత ఉంటాయి.

### ఇంటర్ సప్లిమెంటరీ ఫీజుకు
## ముగిసిన గడువు

రోలుగుంట : ఇంటర్ సప్లిమెంటరీ పరీక్ష గడువు శనివారంతో ముగిసిందని స్థానిక జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బానోతు సుజాత తెలిపారు. ఇంటర్‌లో ఫెయిల్ అయిన విద్యార్థుల నుంచి ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 14 నుంచి ఫీజులు కట్టించుకుంటున్నామని తెలిపారు. గడువు పొడిగింపు, లేదా ఫైన్‌తో కట్టించుకునే ఉత్తర్వులు కానీ ఇప్పటి వరకూ రాలేదన్నారు. ప్రస్తుతం గడువు ముగిసిందని తెలిపారు.

## వినియోగంలోకి ఐఎల్ఆర్

కొయ్యూరు : రాజేంద్రపాలెం ఆసుపత్రిలో నిరుపయోగంగా ఉన్న ఐస్‌లైన్ రిఫ్రిజిరేటర్(ఐఎల్ఆర్) వినియోగంలోకి వచ్చింది. ఎర్త్‌వైర్‌ను ఏర్పాటు చేసి వాటిని వినియోగంలోకి తీసుకువచ్చారు. ఆసుపత్రి ఆవరణలో పెరిగిన తుప్పలను తొలగించారు. గర్భిణుల సంరక్షణ కేంద్రంలో ఏర్పాటు చేయడానికి ఇటీవల మంచాలు కొనుగోలు చేశారు. మిగతా అవసరాలను కూడా సమకూర్చుతామని డ్రాయింగ్ అధికారి రఘురాం తెలిపారు.

## చురుగ్గా భూస్వచ్ఛీకరణ సర్వే

గొలుగొండ : రెవెన్యూ రికార్డులు సరి చేసేందుకు చేపట్టిన భూస్వచ్ఛీకరణ సర్వే చురుగ్గా సాగుతోంది. ఇప్పటికే విప్పలపాలెం, చోద్యం, అమ్మపేట ప్రాంతాల్లో రెవెన్యూ సిబ్బంది భూములు సర్వే చేసినట్టు తహశీల్దార్ అంబేద్కర్ తెలిపారు. వీఆర్వోలు పడాల్, శ్రీను, రాజు, సర్వేయర్ రామారావు, రెవెన్యూ సిబ్బంది ఈ స్వచ్ఛీకరణలో పాల్గొన్నారు.

## కొత్తకోట ఎస్‌బిఐ మేనేజర్‌గా ప్రభాకరరావు

రావికమతం : కొత్తకోట ఎస్‌బిఐ మేనేజర్‌గా పిఎన్‌డి.ప్రభాకర రావు బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ ఇక్కడ పని చేసిన పివి.రావుకు బదిలీ కాగా, కొమ్మాది బ్రాంచి నుంచి బదిలీపై వచ్చిన ప్రభాకరరావు బాధ్యతలు స్వీకరించారు. ఖాతాదారులకు ఎల్లవేళలా అందు బాటులో ఉండి సేవలు అందిస్తామని చెప్పారు.

## పరవాడలో ప్రశాంతంగా నవోదయ పరీక్ష



పరవాడ : పరవాడ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతముగా జరిగింది. మండలం లోని 314 మంది దరఖాస్తు చేసుకోగా 289మంది విద్యార్థులు హాజరయ్యారు. యలమంచిలి ఉప విద్యా శాఖాధికారిని యలమంచిలి ఉప విద్యా శాఖాధికారిని ఎం.సునీత శనివారం పరవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోజరుగుతున్న నవోదయ ప్రవేశ పరీక్షను పర్యవేక్షించారు.

## అలరించిన గాన కచేరి

విజయనగరం: శ్రీరామతీర్థాలు దేవస్థానంలో శనివారం కళారాధన కార్యక్రమం శనివారం జరిగింది. ఇందులో బి.హేమలత గాత్రకచేరి పలువురిని అలరించింది. బ్రహ్మకడిగిన పాదము, శ్రీమహాగణపతి, నారాయణ తీర్థులు, గానం చేశారు. వయులీనంపై ఎం.వి.కామేశ్వరరావు..మృదంగంపై శివకుమార్ సహకరించగా ఆహుతులు వారిని సత్కరించారు.

## లోక కళ్యాణార్థం హోమం

విజయనగరం: శ్రీరామతీర్థంలో శనివారం శ్రీసీతారామస్వామి ఆలయం వద్ద ఉత్తరాంధ్రసాధుపిషత్ అధ్యక్షులు సమతా నంద, శ్రీవణ్‌స్వామి పర్యవేక్షణలె లోకకళ్యాణార్థం హోమం జరిగింది. గిరిడ గ్రామ సర్పంచ్, భక్తులు ఈ కార్యక్రమానికి వచ్చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## చంద్రన్న పెళ్లి కానుక పై అవగాహన



మాట్లాడుతున్న డిఆర్‌డిఏ అడ్మినిస్టేట్ అసిస్టెంట్ అప్పలరాజు

నర్సీపట్నం : చంద్రన్న పెళ్లి కానుక పథకంపై అవగాహన అవసరమనిడిఆర్‌డిఏ అడ్మినిస్టేట్ అసిస్టెంట్ అప్పలరాజు అన్నారు. శనివారం వెలుగు కార్యాలయంలో ఐదు మండలాల కళ్యాణమిత్రలు, విఒఎఎస్‌లకు అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లా డుతూ పెళ్లి తేదీ నాటికి పెళ్లి కుమార్తె వయస్సు 18, పెళ్లి కుమారుడికి 21 సంవత్సరాలు ఉండాలన్నారు. ఏప్రిల్ 20 నుంచి ఈ పథకం అమల్లో వచ్చిందన్నారు. మీ సేవలో జారీ చేయబడిన కులం, నివాస, జనన దృవీకరణ పత్రం, రేషన్ కార్డు, అంగవైకల్యం ఉన్న వారైతే సదరం సర్టిఫికేట్ ఉండాలన్నారు. గ్రామాల్లో ఈ పథకం పై అవగాహన కలిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏరియా కోఆర్డినేటర్ పి.రమణ, నర్సీపట్నం ఏపిఎం ఎన్.సత్తిబాబు, గొలుగొండ ఏపిఎం రమణ కుమారి, నాతవరం ఏపిఎం మంగ, రోలుగుంట ఏపిఎం లక్ష్మి, కళ్యాణ మిత్రులు పాల్గొన్నారు.

## అంగన్వాడీలకు బయోమెట్రిక్ హాజరు నుండి విముక్తి కల్పించాలి

### అంగన్వాడీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎం.అప్పలరాజు




ఆర్డీవో కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న అంగన్వాడీలు

నర్సీపట్నం : అంగన్వాడీలకు బయోమెట్రిక్ హాజరు నుండి విముక్తి కల్పించాలని డిమాండ్ చేస్తూ అంగన్వాడీ అసోసియేషన్ (ఏఐటియుసి అనుబంధం) జిల్లా అధ్యక్షులుఎం.అప్పలరాజు ఆధ్వర్యం లో శనివారం నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయం ఎదుట భారీ ఎత్తున ఆందోళన చేశారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ కొన్ని ప్రాంతాల్లో ఒక కిలో మీటరు దూరం వెళ్లాల్సి వస్తోందన్నారు. ఆ సమయంలో చిన్నారులకు ఆలనా, పాలనా భద్రత కొరవడే ప్రమాదముందన్నారు. ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నందున చిన్నారులు అనారోగ్యం బారిన పడకుండా ప్రభుత్వ పాఠశాలతో సమానంగా వేసవి సెలవులు ఇచ్చే విషయంలో త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలన్నారు. ఖాళీగా ఉన్న అంగన్వాడీ పోస్టులను భర్తీ చేయకపోవడం వలన అంగన్వాడీలు శారీరక, మానసిక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అర్హులైన అంగన్వాడీలకు సూపర్‌వైజర్ పోస్టులు ఇవ్వాలన్నారు. దీనికి సంబంధించి నోటిఫికేషన్ వేసవి సెలవులలో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు కె.వెంకాయ్యమ్మ, కిముడు నూకరత్నం, కె.దేవి, బి.రేవతి, సిహెచ్.భవానీ, కె.చంద్రమౌళి పాల్గొన్నారు.

## ఘనంగా నూకరాజు ప్రథమ వర్ధంతి

కొయ్యూరు : కొయ్యూరు మండలం బంగారంపేటలో సిపిఐ పార్టీ నాయకులు పాంగి నూకరాజు ప్రథమ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా అధ్యక్షులు బాలేపల్లి వెంకటరమణ హాజరై ఆయన చిత్రపఠం, స్థూపం వద్ద పూలమాల వేసి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ నూకరాజు బంగారంపేటలో రెండు సార్లు సర్పంచ్‌గా పని చేశారన్నారు. భూపోరాటయోధుడు మేకా సూరిబాబు వారసత్వాన్ని అందిపుచ్చుకుంటున్న నాయకులు నూకరాజు అన్నారు. అనేక భూపోరాటాలు చేసి గిరిజనులకు న్యాయం చేశారన్నారు. గత ఎంపిటిసి ఎన్నికల్లో తన కుమారుడు వైసిపి నుండి పోటీ చేసినప్పటికీ సిపిఐ పార్టీ తరపున నిలబడిన అభ్యర్థికి తన మద్దతును ప్రకటించడం నూకరాజుకే చెల్లిందన్నారు. ఈ కార్యక్రమంలో కొయ్యూరు సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఉల్లి సత్యనారాయణ, సిపిఐ జిల్లా సమితి సభ్యులు పులిశెట్టి చినతాతయ్య, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మేకా సత్యనారాయణ, పాడి లోవరాజు, ఎంవి.సత్యనారాయణ, రావణాపల్లి మాజీ ఎంపిటిసి సభ్యులు సుర్ల లోవరాజు పాల్గొన్నారు.



### పురపాలక సంఘం ఆధ్వర్యంలో
## చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న వైస్ చైర్మన్ సన్యాసిపాత్రుడు

నర్సీపట్నం : నర్సీపట్నం పురపాలక సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని శనివారం నర్సీపట్నం మున్సిపల్ వైస్ చైర్మన్ చింతకాయల సన్యాసపాత్రుడు ప్రారంభించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండ చాలా విపరీతంగా కాస్తున్నాయన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని పురపాలక సంఘం ఆధ్వర్యంలో ప్రయాణికుల సౌకర్యార్థం చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అలాగే ముఖ్యంగా స్వచ్ఛంధ సంస్థలు చలివేంద్రాల ఏర్పాటుకు ముందుకు రావాలాన్నారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, సన్యాసిపాత్రుడు తనయుడు దొరబాబు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## ప్రత్యేక హోదా కోరుతూ సైకిల్ యాత్ర

పరవాడ : ప్రత్యేక హోదా కోరుతూ మండలం లోనిముత్యాలమ్మపాలెం, నాయుడుపాలెం ,రావాడ గ్రామాలలో జరిగే సైకిల్ యాత్రను శనివారం పెందుర్తి ఎమ్మెల్యే బండారు సత్యనారయణ మూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా బండారు మాట్లాడుతూ. ఈ నెల 29 వరకు ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు.

హోదా ఇస్తామని హామీ ఇచ్చిన మోడీ సర్కార్ హామీ అమలు చేయకుండా 5 కోట్ల ఆంధ్రులను మోసం చేశారాన్నారు. చంద్రబాబు చేపట్టిన ధర్మ దీక్షతో దేశం మొత్తం ఎపి గురించే చర్చ జరుగుతోందని తెలిపారు.ఈ యాత్రలో పెందుర్తి నియోజకవర్గ ఇన్ చార్జి బండారు అప్పలనాయుడు ,పరవాడ జెడ్పీటీసీ పైల జగన్నాధరావు,పరవాడ ఎంపిపి మాసవరపు అప్పలనాయుడు,వైస్ ఎంపిపి చింతకాయల సుజాత ముత్యాలు,ఎఫ్ సి ఐ మెంబర్ పైల సన్యాసి రాజు,టిడిపి నాయకులు రెడ్డి నారాయణరావు, మండల తెలుగుదేశం పార్టీ అద్యాక్షులు బోండా సన్నిదేముడు, వియ్యపు చిన్న ,మండలం లోని సర్పంచ్ ,ఎంపిటిసిలు పాల్గొన్నారు.

## ఉచిత గ్యాస్ కనెక్షన్లు పంపిణీ




భీమునిపట్నం : దారిద్యరేఖ దిగువ ఉన్న పేదలకు కేంద్ర ప్రభుత్వం పిఎంయువై పథకం ప్రవేశ పెట్టినట్లు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ డైరెక్టర్ రామసాయి అన్నారు. ప్రధాన ఉజ్వల్ యోజన పథకం లో భాగంగా స్థానిక తోటవీధి కళ్యాణ మండపంలో దారిద్యరేఖ దిగువ ఉన్న పేదలకు ఉచిత గ్యాస్ పంపిణీ చేయడానికి ముఖ్య అతిథిగా విచ్చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, నిరుపేద మహిళలకు ఈ పథకం కేంద్రప్రభుత్వం పెట్టినట్లు చెప్పారు. కాగా 30మంది లబ్ధిదారులకు గ్యాస్ పంపిణీ చేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఐఒసిఎల్ మేనేజర్ హర్ష భీమిలి ఇండియన్ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ నాగేశ్వరరావు, న్యాయవాది కె.మల్లిఖార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

## బాబూరావు మృతి తీరని లోటు

### ఏయూ వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు

ఆంధ్ర విశ్వ విద్యాలయం : గ్రంధాలయాధికారి (లైబ్రేరియన్)గా సేవలందించిన ఆచార్య జి.బాబు రావు మృతి వర్సిటీకి తీరని లోటని ఏయూ వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు అన్నారు. శనివారం సాయంత్రం ఏయూ గ్రంధాలయంలో ఏర్పాటు చేసిన బాబు రావు సంతాప సభలో ఆయన పాల్గొన్నారు.

ముందుగా బాబురావు చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. అనతరం ఆయన మృతికి సంతాప సూచకంగా మౌనం పాటించారు. గ్రంధాలయాధికారిగా పూర్తిస్థాయిలో పనిచేస్తూ విద్యార్థులకు, పరిశోధకులకు అవసరమైన సమర్ధ సేవలు ఆయన అందించారన్నారు. వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య వి.ఉమా మహేశ్వర రావు, గ్రంధాలయాధికారి ఆచార్య కె.విశ్వేస్వర రావు, పాలక మండలి సభ్యులు ఆచార్య కె.రామ మోహన రావు, ఎం.ప్రసాద రావు, ఉన్నత విద్యామండలి పూర్వ ఉపాధ్యక్షులు ఆచార్య విజయ ప్రకాష్, ఆచార్య టి.వెంకట కృష్ణ, డాక్టర్ టి.షారోన్ రాజు, గ్రంధాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### చంద్రన్న సంచార చికిత్స వాహన ఉద్యోగుల ధర్నాకు
## ఎమ్మెల్సీ కోలగట్ల సంఘీభావం



విజయనగరం : పట్టణంలోని జిల్లా కేంద్ర ఆసుపత్రి ప్రాంగణంలో జరుగుతున్న చంద్రన్న సంచార చికిత్స వాహనాలలో పనిచేస్తున్న ఉద్యోగులు ధర్నా కార్యక్రమానికి మద్దతుగా ఎమ్మెల్సీ, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఉత్తరాంధ్ర కన్వీనర్ కోలగట్ల వీరభద్రస్వామి, మాజీ మంత్రి నెల్లిమర్ల పార్టీ సమన్వయ కర్త పెనుమత్స సాంబశివరాజులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కోలగట్ల మాట్లాడుతూ 104 సేవలు ప్రజలకు అవసరమైనవని గుర్తించి వైఎస్ రాజశేఖరరెరడ్డి హయాంలో ప్రవేశపెట్టారని, ఈరోజు సదరు పధకానికి పేరు మార్చి చంద్రన్న సంచార చికిత్స అని పేరుపెట్టి సదరు సేవలు పూర్తిగా నిర్వీర్యం చేసి ఉద్యోగులకు ఎటువంటి భద్రత లేకుండా చేశారని, ప్రస్తుతం 104 వాహనాలు ప్రైవేటు సంస్థల ద్వారా నిర్వహిస్తూ కనీస ప్రమాణాలు పాటించకుండా, వాహనాలకు మరమ్మతులు సకాలంఓల చేయించకుండా వాహన ఇన్స్యూరెన్స్‌లు చెల్లించకుండా తిప్పడం దారుణమన్నారు. ఈ మధ్యకాలంలో ఇద్దరు వ్యక్తులు మృతికి 104 వాహనం సరిగా లేకపోవడమే కారణమన్నారు. ఈ కార్యక్రమంలో నగర పార్టీ అధ్యక్షులు ఆశపు వేణు, మండల పార్టీ అధ్యక్షులు నడిపేన శ్రీనివాసరావు, సీనియర్ కౌన్సిలర్ ఎస్.వి.వి. రాజేష్, రాంపండు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు పి.జైహింద్ కుమార్, నాయకులు బొద్దాన అప్పారావు, కంటుభుక్త తవిటిరాజు, కనకల ప్రసాద్, రెడ్డి గురుమూర్తి, మజ్జి త్రినాధ్, గంగ, దుబ్బే బ్రదర్స్, పొట్నూరు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు మోసపూరిత మాటలు ప్రజలు నమ్మే స్థితిలో లేరు

విజయనగరం : ఊసరవిల్లి రంగులు మార్చినట్లు తను పంథాను మార్చుకొని మళ్లీ ప్రత్యేక హోదా పేరుతో ప్రజలను మోసం చేయడానికి చంద్రబాబు నాయుడు ప్రజల ముందుకు వస్తున్నాడని, చంద్రబాబు నాయుడు మోసపు మాటలను నమ్మి మళ్లీ మోసపోవడానికి ప్రజలు సిద్ధంగా లేరని నగర పార్టీ అధ్యక్షులు ఆశపు వేణు అన్నారు. శనివారం కోలగట్ల నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు మోసాలు వార్డు, వార్డుకు వెళ్లి ప్రజలకు వివరిస్తామన్నారు. మండల పార్టీ అధ్యక్షులు నడిపేన శ్రీనివాసరావు మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి ప్రజలు ఉపయోగపడే విధంగా నవరత్నాలు కార్యక్రమం తయారు చేసారని, ప్రత్యేక హోదా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వల్ల మాత్రమే వస్తుందన్నారు. కౌన్సిలర్ ఎస్.వి.వి.రాజేష్ మాట్లాడుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ చేసిన ప్రత్యేక హోదా దీక్షకు, చంద్రబాబు దీక్షకు ఎక్కడా పొంతన లేదని, ఎసిలు పెట్టుకొని చంద్రబాబు దీక్షలు చేస్తే, వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రతికూల పరిస్తుతులలో దీక్షలు చేసిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా వచ్చే వరకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రాంపండు, బొద్దాన అప్పారావు, అల్లు చాణిక్య, మారం బాలబ్రహ్మారెడ్డి, మజ్జి త్రినాధ, సత్తరపు శంకరరావు, రౌతు భాస్కరరెడ్డి, రెడ్డి గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# దేవాంగుల సంక్షేమ సంఘం ప్రథమ వార్షికోత్సవం వేడుకలు




విశాఖపట్నం : రాష్ట్ర వ్యాప్త జనాభాలో 15 శాతం ఉన్న దేవాంగుల సంక్షేమాలు చూడటానికి తమ సామాజిక వర్గంనుంచి ఒక్కరు కూడా చట్టసభల్లో లేరని, రానున్న కాలంలో తమ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తుల్ని చట్టసభల్లోకి పంపడమే తమ ముందున్న లక్ష్యమని దేవాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిన వెంకటరాయుడు తెలిపారు. శనివారం వీజేఎఫ్ లో విలేకర్లతో మాట్లాడుతూ జనాభా ధామాషా ప్రాతిపాదికిన రాజ్యసభ, శాసనమండలి సీట్లు తమ సామాజిక వర్గానికి కేటాయించాలన్నారు. 13 జిల్లాలో సుమారు 75 లక్షల మంది దేవాంగులున్నారన్నారు. వీరంతా చేనేత వృత్తినే ప్రధానంగా చేసుకుని జీవనం సాగిస్తున్నారన్నారు. టెక్స్‌టైల్ రంగంతో చేనేత రంగాన్ని విడదీయా లని డిమాండ్ చేశారు. టెక్స్‌టైల్ రంగంతో కలిసున్నవాళ్ళు తమ బ్రతుకులు బాగుపడవని ఆవేదన వ్యక్తంచేశారు. జిఎస్టీ పుణ్యమా అని చేనేతరంగంలో ప్రత్యక్షంగా 3 లక్షలమంది పరోక్షంగా 8 లక్షలమంది పూర్తిగా ఉపాధి కోల్పోయారన్నారు. దేవాంగుల సంక్షేమ సంఘం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 22వ తేదీన విశ్వప్రియ ఫంక్షన్ హాలులో సిఎంఆర్ అధినేత మావూరి వెంకరమణ అధ్యక్షతన వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 9 గంటలకు ప్రత్యేక హెూదా కొసం కాళీమాత దేవాలయం వద్ద మానవహారం చేస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో ప్రధానకార్యదర్శి మాడిశెట్టి శివశంకరయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ తూతిక శ్రీనివాస్ విశ్వనాద్, ఆల్ ఇండియా దేవాంగ సంఘం స్పోక్స్ పర్సన్ మదన్ దేవాంగన్, రాష్ట్ర కార్యదర్శి బచ్చు సత్యన్నారాయణ, విశాఖ జిల్లా అధ్యక్షుడు కటకం సాంభమూర్తి, అసోసియేట్ అధ్యక్షుడు తూతిక అప్పాజీ తదితరులు పాల్గొన్నారు.

# సత్యదేవున్ని దర్శించిన ప్రముఖులు

**బీజేపీ రాష్ట్ర నాయకుడు కన్నా లక్ష్మీనారాయణ, హైకోర్టు చీఫ్ జస్టిస్ ఈశ్వరయ్య**





అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివార్ని బీజేపీ రాష్ట్ర నాయకుడు, మాజీ మంత్రి శ్రీ కన్నా. లక్ష్మీనారాయణ, హైకోర్టు జస్టిస్ శ్రీ ఈశ్వరయ్య కుటుంబ సమేతముగా శ్రీ సత్యదేవుణ్ణి దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. వారికి ఎసి.ఈరంకి.జగన్నాధరావు, ఆలయ సూపరింటెడెంట్ బలువు.సత్య శ్రీనివాస్ ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితుల వేదాశీస్సులు అనంతరం శ్రీ స్వామివారి ప్రసాదాన్ని వారికి అందజేశారు.




*ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆసీఫా మృతికి సంతాప సూచకంగా తమ ప్రగాఢ సానుభూతిని తెలుపుతూ నగరంలో జివిఎంసి గాంధీ విగ్రహం నుండి ఎల్ఐసి అంబేద్కర్ విగ్రహం వరకు కొవ్వత్తుల ర్యాలీ నిర్వహించిన దృశ్యం*

# వంశీకృష్ణ శ్రీనివాస్ వార్డు పర్యటన



విశాఖపట్నం : విశాఖ తూర్పు నియోజకవర్గంలో అప్పుఘర్, వాసవానిపాలెం, మూల పాలెం గ్రామాలలో విశాఖ తూర్పు నియోజకవర్గ వైఎస్ఆర్‌సిపి సమన్వయకర్త వంశీకృష్ణ శ్రీనివాస్ ఉదయం 7 గంటలకు ప్రజల సమస్యలను స్వయంగా అడిగి తెలుసు కున్నారు. ముందుగా స్థానిక గ్రామపెద్దలు మరియు మహిళలతో మమేకమై వారి సమస్యలను అడిగి వార్డులో పర్యటించారు. కార్యక్రమంలో అనేకమంది మహిళలు, వివిధ సమస్యలు వంశీకృష్ణ దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా మద్యంషాపులు విరివిగా స్థానిక ఎమ్మెల్యే ప్రోద్భలంతో ఏర్పాటుచేశారని, వెంటనే దుకాణాలు మూసివేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పేర్ల విజయచంద్ర, వాసపల్లి యల్లాజి, సత్తయ్య, పైడయ్య, గరికిన సింహాచలం, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## 23న రహదారి భద్రతా వారోత్సవాలు

యానాం : రవాణా భద్రతా వారోత్సవాలను ఈ నెల 23 నుండి నిర్వహిస్తున్నల్లు రవాణా శాఖ ఎ. రవిచంద్రన్ ఓ ప్రకటనలో తెలిపారు. రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రజలో అవగాహన కల్పించేందుకు రవాణా భద్రతా వారోత్సవాలను నియోజకవర్గ అన్ని గ్రామాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాలు అతివేగంవలన, నిర్లక్ష్యంవలన జరుగుతున్నా యని ప్రజలను అప్రమత్తం చేసేందుకు ఈ సదస్సును నిర్వహించనున్నామన్నారు. ఈ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## ప్రశాంతంగా 6వ తరగతి నవోదయ పరీక్ష

యానాం : స్థానిక జవహర్ నవోదయ విద్యాలయాలలో ఆరో తరగతి ప్రవేశ పరీక్ష రెండు కేంద్రాలలో ప్రశాంతంగా జరిగాయి. శనివారం ఉదయం స్థానిక రాజవ్‌గాంధీ ప్రభుత్వ ఇంగ్లీష్ మీడియం ఉన్న తపాఠశాల, మహాత్మాగాంధీ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్ ఎ. అనురాధ అధ్యక్షతన 6వ తరగతి ప్రవేశ పరీక్ష నిర్వహించగా సుమారు 500 మందికిగాను 447 మంది విద్యార్థులు హాజరై పరీక్షలురాసారు. నవోదయ విద్యాలయ చైర్మన్ పరిపాలనాధికారి దవులూరి సుబ్రమణ్యేశ్వరరావు పరీక్షా నిర్వహణ తీరును పరిశీలిం చారు. అలాగే విద్యాశాఖ అధికా కాలేశాయినద్ తదితరులు పరిశీలించారు. ఫలితాలను వారం రోజులలో విడుదల చేయనున్న ట్లు నవోదయ అధికారులు తెలిపారు.

# పెద్దాపురంలో టి.డి.పి. సైకిల్ యాత్ర



పెద్దాపురం : ప్రత్యేక హెూదా సాధన కార్యక్రమంలో భాగంగా పెద్దాపురం నియోజకవర్గం తాటిపత్రి గ్రామంలో ఉపముఖ్య మంత్రి, హెూంమంత్రి చినరాజప్ప ఆధ్వర్యంలో భారీ ర్యాలీని ప్రారంభించారు. నియోజకవర్గంలో గల తిరుపతి, చదలాడ దివిలి, తాటిపర్తి, గోరింట పులిహెూరు, వడ్లమూరు, రాగంపేట గ్రామాల లో సైకిల్ యాత్ర చేయనున్నట్లు రాజప్ప తెలిపారు. ఈ యాత్ర గ్రామప్రజల మౌలిక సదుపాయాలు కల్పించి, వారి అభివృద్ధి సంక్షేమం కొరకు రాష్ట్ర ముఖ్యమంత్రి చేస్తున్న అభివృద్ధిని అందరికి అందేవిధంగా చర్యలు చేపట్టినట్లు చినరాజప్ప తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక పార్టీ కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో హాజరైనారు. ప్రజలు చినరాజప్పకు ఆహ్వానం పలికారు.

# గ్రంథాలయ ఆధ్వర్యంలో ఉచిత వేసవి శిక్షణా తరగతులు

రావులపాలెం : విద్యార్థులు విద్యలో అత్యున్నత స్థానాన్ని అధిగమించేందుకు వేసవి శిక్షణా శిబిరాలు ఎంతగానో ఉపయోగిస్తాయని గ్రంథాలయ అధికారి పి. వెంకట్రావు తెలిపారు. శనివారం మండల పరిధి గోపాలపురం గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో గ్రంథాలయ అధికారి పాల్గొని మాట్లాడుతూ మే 25 నుండి జూన్ 7వరకు గోపాలపురం గ్రంథాలయ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణా శిబిరం ఏర్పాటు చేసామని, ఈ శిక్షణా శిబిరంలో 11 నుండి 15 సంవత్సరముల లోపు 6 నుండి 10వ తరగతి చదివినవారై ఉన్నవారు పాల్గొనవచ్చని, ఈ శిక్షణా తరగతులు ఉదయం 8 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. ఉదయం 8 నుండి 10 వరకు పుస్తక పఠనం, 10 నుండి 11వరకు కథలు వ్రాయడం, 11 నుండి 12 వరకు ఇంగ్లీష్ చిత్రలేఖనంలో శిక్షణ ఇస్తామని ఆయన తెలిపారు. వీటితోపాటు సంగీతం, నాట్యం, ఉపన్యాసం వంటి వాటిపై శిక్షణ ఇస్తామన్నారు. ఆశక్తి గల విద్యార్థులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని గ్రంథాలయ అధికారి తెలియజేసారు.

# చంద్రన్న పెళ్ళి కానుకల గూర్చి విస్తృత ప్రచారం



అన్నవరం/తొండంగి... తూ.గో.జిల్లా తుని నియోజకవర్గం తొండంగి మండలంలో శనివారం తుని నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీ యనమల కృష్ణుడుగారు చేతులమీదుగా చంద్రన్న పెళ్లికానుకకు సంబంధించి కళ్యాణమిత్రలను నియమించారు.నిరుపేదలకు ఆసరాగా చంద్రన్న పెళ్లికానుకలను విస్తృతంగా ప్రచారం చేసి లబ్దిదారులకు అందరికి న్యాయం జరిగేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు యడ్ల బేతాళు డు(రాజా),మండల ప్రజా పరిషత్తు అధ్యక్షురాలు చిట్టిమురి సంధ్యారాణి ఎమ్ డివో బి.శివమూర్తి ,వెలుగు ఎపిఎమ్ సత్తిబాబు మరియు వెలుగు సిబ్బంది, నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

## అరకులోయలో బైక్‌ర్యాలీ



*అరకులోయ : నియోజకవర్గ కేంద్రంలో తెలుగుదేశం పార్టీ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పి. రాజారావు, పొద్దు అమన్నా మండల పార్టీ అధ్యక్షుడు శిట్టి బాబురావు, మాజీ ఎమ్మెల్యే ఎస్ సోము, సర్పంచ్‌లు, ఎంపిటీసీలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.*

# సిఎం చంద్ర బాబు తక్షణం రాజీనామా చేయాలి

తాళ్లరేవు : రాజ్యాంగ బద్ధంగా పదవీప్రమాణ స్వీకారం చేసి ఆ విలువలకు త్రిలోదకాలు ఇస్తున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తక్షణం సిఎం పదవికి రాజీనామా చేయాలని వైఎస్ఆర్‌సిపి నాయకుడు తిల్లపూడి నాగేశ్వరరావు డిమాండ్‌చేశారు. దేశ ప్రధానిని నానా దుర్భాషలాడటం రాజ్యంగ ఉల్లంఘన కిందకు వస్తుందని అలాగే హందూ పురం ఎమ్మెల్యే బాలక్రిష్ణ అసభ్యపదాజాలంతో దూషించడం నేరమని వీరద్దరూ తక్షణం రాజీనామా చేసేలా గవర్నర్ నరసింహన్ చర్యలు చేపట్టాలని డిమాండ్‌చేశారు. వీధి రౌడీలా దేశ ప్రధానిని విమర్శించడం ఎంతవరకు సబబు అని ఆయన ప్రశ్నించారు. హుందాగా వ్యవహరిస్తు ఆరోపణలు చేయాలి తప్ప నోటికి వచ్చినట్లు మాట్లాడటం ప్రజలలో వారికి విలువ తగ్గుతుంద న్నారు. ఇటీవల వారుచేసిన ప్రకటన మతిస్థి మితం కోల్పోయి మాట్లాడుతున్నట్లు ప్రజలు గ్రహిస్తున్నారని రానున్న ఎన్నికలలో తమ ఓటమి ఖాయమని తెలిసి వీరు దిగజారుడు ప్రకటనలు చేస్తున్నారన్నారు.

ఇటువంటి దూషణలు చేసే వారిపై చర్యలు తీసుకోకపోతే ఇక మరికొంత మంది నాయకులు తయారయ్యే ప్రమాదముం దన్నారు. వీర్ని అరెస్టుచేసేందుకు గవర్నర్ చర్యలు చేసట్టాలని డిమాండ్ చేశారు. గవర్నర్ చర్యలు చేపట్టకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన జరిగే ప్రమాదం ఉందన్నారు.

# వైసిపి బలోపేతానికి కార్యకర్తలందరూ కృషిచేయాలి: అన్నంరెడ్డి



సబ్బవరం: వైసిపీ బలోపేతానికి కార్యకర్తలం దరూ కృషిచేసి రానున్న ఎన్నికలలో విజయ పధాన నడిపించాలని మండల కేంద్రంలో ఉన్న పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశంలో ముఖ్యఅతిధిగా పెందుర్తి సమన్వయ కర్త అన్నం రెడ్డి అధీప్‌రాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికలలో పార్టీ విజయానికి కార్యకర్తలందరూ కృషిచేయాల న్నారు. జగన్ మోహన్‌రెడ్డి పాతయాత్రను విజయవంతంచేయాలని కోరారు. ఈ కార్య క్రమంలో జిల్లా బిసి సెల్ అధ్యక్షులు కొటాన రాము, మండల పార్టీ అధ్యక్షులు తుంపాల అప్పారావు, వనం అచ్చింనాయుడు, కొటాన కోటయ్య, కొటాన వెంకటరమణ, మోపాడ అప్పారావు, వడ్డాది అప్పలరాజు, సబ్బవరపు సత్యనారాయణ, సత్యనారాయాణరాజు, శేఖర్, పరవాడ వెంకట రమణ కేశవరావు, సబ్బవరపు నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

# గోవింద నామస్మరణతో మార్మోగిన వాడపల్లి

**స్వామిని దర్శించుకున్న చీఫ్ కమీషనర్ కస్టమ్స్ & జిఎస్‌టి అధికారి వై. శరావత్ స్వామి**



రావులపాలెం : ఆత్రేయపురం మండలం, వాడపల్లిలో వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం శనివారం భక్త జన సందోహంతో గోవింద నామస్మరణతో మార్మోగింది. స్వామి వార్కి నీరాజన మంత్రపుష్పం అర్చన, అభిషేకం, సుప్రభాత సేవ వంటి కార్యక్రమాలతో స్వామివార్ని మేలుకొల్పిన అనంతరం భక్తులు స్వామి వార్ని దర్శించుకొని మొక్కులు తీర్చు కున్నారు. రాష్ట్రంలోని నలు మూలలనుండే కాకుండా ఇతర రాష్ట్రాలనుండి శనివారం ఏడు శనివారముల వ్రతం చేసుకొనుచున్న భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారి ఆలయానికి చేరుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం 10 గంటల నుండి ఆలయం వెనుక అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ చైర్మన్ కరుటూరి నరసింహారావు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజులు పర్యవేక్షిం చారు. వీరితోపాటు ఆలయ సిబ్బంది, పండి తులు, వేద పండితులు, పోలీసు సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది, రెవిన్యూ సిబ్బంది, దాతలు, స్వచ్ఛంద సంస్థలు భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించారు. అదేవిధంగా శనివారం చీఫ్ కమీషనర్ కస్టమ్స్ & జిఎస్‌టి అధికారి వై. శరావత్ స్వామి వారి దర్శనం చేసుకున్నారు. వీరిని ఆలయ చైర్మన్ కరుటూరి నరసింహారావు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజులు స్వామి వారి చిత్రపటాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు వరదా సుబ్బారావు, ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ సిబ్బంది సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

# అన్నవరం చూసొద్దాం రారండీ!!



తూర్పు గోదావరి జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరంలో కోరిన కోర్కెలు తీర్చే వరదుడు అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి. అన్నివరాలు ఇచ్చే స్వామిగా, భక్తుల కొంగు బంగారంగా తూర్పుగోదావరి జిల్లా అన్నవరం సత్యనారాయణ స్వామి దేవస్థానం ప్రసిద్ధికెక్కింది. సత్యనారాయణ స్వామికి కుడి పక్కన ఈశ్వరుడు, ఎడమ పక్కన అనంతలక్ష్మి అమ్మవారు దర్శనమిస్తారు. ఇక్కడ స్వామివారిని రెండు అంతస్తుల్లో దర్శించుకోవాల్సి ఉంటుంది. మొదటి అంతస్తులో స్వామివారి మూల స్తంభం. పాదాలు దర్శించుకొని.. మెట్లపైగా పైఅంతస్తుకు వెళితే శ్రీ సత్యనారాయణస్వామి మహేశ్వరుడు.. అనంతలక్ష్మి అమ్మవారు ఒకే పీఠంపై కనువిందు చేస్తారు. ఇలా ఒకే పీఠంపై శివ-కేశవులు, అమ్మవారు కనిపించే ఆలయం మరెక్కడా లేదు. ఇక్కడ రోజూ సుప్రభాత సేవ మొదలు పలు ప్రత్యేక కార్యక్రమాలు, ఉత్సవాలు నిర్వహిస్తుంటారు.



నిత్యం వేల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. ప్రధానంగా వివాహాది శుభకార్యాలకు ఈ ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందింది. కొత్తగా పెళ్లైన దంపతులు తప్పని సరిగా సత్యదేవ వ్రతం చేయడం తెలుగు ప్రజల సంప్రదాయం. ఈ వ్రత విశిష్టతను పురాణాల్లో సైతం వివరించారు. ఆ మేరకు ఇక్కడ రోజూ సత్యదేవ వ్రతాలు, తిరుమల తరహాలో.. నిత్య కల్యాణాలు జరుగుతుంటాయి.

స్థల పురాణం ప్రకారం తూర్పు గోదావరి జిల్లా తుని పట్టణానికి సుమారు 18 కి.మీ.ల దూరంలోని రత్నగిరి పర్వతంపై 1891-ఖర నామ సంవత్సరంలో శ్రావణ శుద్ధ విదియ రోజున ఒక అంకుడు చెట్టు కింద తాను వెలుస్తానని సమీపంలోని గోర్స దివాణం జమీందార్ రాజా ఇనుగంటి వెంకట రామరాయలకు శ్రీసత్యనారాయణస్వామి స్వయంగా కలలో కనిపించి చెప్పారని ఆలయ చరిత్ర ద్వారా తెలుస్తోంది. ఈ విషయాన్ని ఆ రాజా తమ గ్రామ పెద్దలకు వివరించగా.. అంతా కలిసి స్వామి విగ్రహాల కోసం వెతికారు. కలలో చెప్పినట్లుగా అంకుడు చెట్టు వద్ద శ్రీసత్య దేవుడు అనంతలక్ష్మి అమ్మవార్ల విగ్రహాలు దొరికాయి. తాత్కాలికంగా అక్కడ పందిరి వేసి విగ్రహాలు ప్రతిష్ఠించారు. ఆ తర్వాత ప్రధానాలయం నిర్మించారు. మరోసారి జీర్ణోద్ధరణ చేసి ఇప్పుడున్న ఆలయాన్ని, రాజగోపురాన్ని నిర్మించారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు సర్వదర్శనాలు ఉంటాయి. ఈ సమయంలో భక్తులు స్వామిని దర్శించుకోవచ్చు. ఇక్కడ స్వామివారి దర్శనం అందరికీ ఉచితమే.

**దర్శన సమయంలో విరామం:** రోజూ స్వామివారికి మహా నివేదన కోసం... మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 30 నిమిషాల పాటు దర్శనాలు ఆపేస్తారు. నివేదన అనంతరం మళ్లీ కొనసాగిస్తారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు శ్రీ సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహిస్తారు. సాధారణ వ్రతమైతే రూ.200, ప్రత్యేక వ్రతమైతే రూ.800, ధ్వజ స్తంభం వద్ద చేసేందుకు రూ1500, విశిష్ట వ్రతమైతే రూ.2000 చొప్పున రుసుం చెల్లించాలి. వ్రతం చేయించుకునే భక్తులు కొబ్బరి కాయలు,అరటిపళ్లు తీసుకొస్తే సరి పోతుంది. మిగతా పూజా సామగ్రి ప్రసాదం,స్వామి వారి రూపు,పసుపు,కుంకుమ, తమల పాకులు తదితర పూజా సామగ్రిని దేవస్థానమే సమకూర్చుతుంది.వ్రతమునకు వ్రతకర్తలైన భార్యాభర్తలతో పాటు వారి పిల్లల్ని అనుమతిస్తారు.

**పరిసరాల్లోని ఉపాలయాలు:** కొండ దిగువున ఘాట్ రోడ్డు ప్రారంభంలో గ్రామ దేవత శ్రీ నేరేళ్లమ్మ తల్లి ఆలయం, తొలిమెట్టు వద్ద శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయం, కొండపైకి వచ్చే మెట్ల మార్గం మధ్యలో వనదుర్గ అమ్మవారి ఆలయం, రత్నగిరి కొండపై క్షేత్ర పాలకుడు శ్రీ సీతారామ చంద్రమూర్తి ఆలయం ఉన్నాయి. అన్నింటిలో దర్శనం ఉచితం. అలాగే ఇక్కడున్న ఫలభా యంత్ర (సన్ డయల్) సందర్శన పర్యాటకుల్ని విశేషంగా ఆకట్టుకుంటుంది. అన్నవరం సత్యదేవుని ప్రసాదానికి విశేష ప్రాధాన్యం ఉంది.

దూర్రపాంత భక్తులు ప్రత్యేకంగా ఈ ప్రసాదాన్ని భక్తిశ్రద్ధలతో తమ బంధువులు, సన్నిహితుల కోసమని తీసుకెళ్తుంటారు. అన్నవరం శ్రీ సత్యదేవునికి నిర్వహించే నిత్య పూజల సమయాలు తెల్లవారు జామున 4 గంటలకు సుప్రభాత సేవ 5 గంటలకు ధూప సేవ, ఉదయం 7 గంటలకు బాలభోగం, 7.30 గంటలకు బలిహరణ, ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకూ చతుర్వేద పారాయణలు.మధ్యాహ్నం 12 గంటలకు మహానివేదన యంత్రం 6 గంటలకు ధూపసేవ. రాత్రి 7 గంటల నుంచి 8 గంటల వరకూ దర్బారు సేవ, రాత్రి 8.30 గంటల నుంచి 9 గంటల వరకూ ఏకాంత సేవ.

**పూజల్లో పాల్గొనేందుకు రుసుముల వివరాలు:** పౌర్ణమికి నిర్వహించే ప్రత్యంగిర హోమంలో పాల్గొనేందుకు. ఉదయం 9.30 గంటల నుంచి 11.30 గంటల వరకూ శ్రీ స్వామివారికి నిత్య కల్యాణం జరుగుతుంది. ఇందులో పాల్గొనదల్చిన భక్తులు రూ.1,116 రుసుం చెల్లించాలి. ఆ మేరకు దేవస్థానమే పూజా సామగ్రి సమకూరుస్తుంది. అనంతరం కల్యాణంలో పాల్గొన్న భక్తులందరికీ స్వామివారి కండువా, జాకెట్టు ముక్క, ప్రసాదం, బంగీ ప్రసాదం అందజేస్తారు. శ్రీ స్వామివారి మూలవరులకు అభిషేకం (ప్రతి నెలా ముఖ నక్షత్రం రోజున) రూ.3,000 టిక్కెట్‌పై అనుమతిస్తారు. రత్నగిరిపై సప్త గోపూజ నిత్యం జరుగుతుంది. రూ.116 రుసుం చెల్లించాలి. శ్రీ సత్యనారాయణస్వామివారి మూలవరులకు స్వర్ణపుష్పార్చన. 108 బంగారు పుష్పాలతో పూజచేసి ప్రసాదం అందిస్తారు. దీనికి రూ.3 వేలు రుసుముగా చెల్లించాలి.

**ఉపాలయాల్లో నిర్వహించే పూజలు:** ప్రతీ శుక్రవారం రత్నగిరిపై ఉన్న వనదుర్గ అమ్మవారి ఆలయంలో చండీహోమం జరుగుతుంది. ఇందులో పాల్గొనేందుకు భక్తులు ఒక్కొక్కరికి రూ.558 చెల్లించాలి. సహస్ర దీపాలరంకరణ మనిషి ఒక్కంటికి రూ.200.

ప్రత్యేక రోజుల్లో విశిష్ట పూజలు: చైత్రశుద్ధ పాడ్యమి పంచాంగ శ్రవణం, చైత్రశుద్ధ అష్టమి నుంచి బహుళ పాడ్యమి వరకూ శ్రీరామనవమి కల్యాణ ఉత్సవాలు జరుగుతాయి. చైత్ర బహుళ షష్టి నుంచి అమావాస్య వరకూ కనకదుర్గ అమ్మవారి బ్రహ్మోత్సవాలు, వైశాఖ శుద్ధ దశమి నుంచి బహుళ పాడ్యమి వరకూ శ్రీ సత్యదేవుని బ్రహ్మోత్సవాలు, శ్రీ నేరేళ్లమ్మ ఉత్సవాలు, శ్రీ స్వామివారి జయంతి వేడుకలు, శ్రీకృష్ణజయంతి, వినాయక చవితి నవరాత్రులు, శ్రీదేవి నవరాత్రులు, కార్తీకమాసంలో ప్రతి సోమవారం శ్రీ స్వామివారికి లక్షపత్రి పూజ చేస్తారు. ప్రతి సోమవారం అమ్మవారికి లక్ష కుంకుమ పూజ, గిరి ప్రదక్షిణ, జ్వాలా తోరణం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు.

**వసతి, భోజన సౌకర్యం వివరాలు:** రత్నగిరిపైన.. అన్నవరంలోనూ దేవస్థానం చౌల్ట్రీలు.. కాటేజ్‌లు... సత్రాల్లో భక్తులకు వసతి కల్పిస్తారు. మొత్తం మీద సుమారు 500 గదులకు పైగా అందుబాటులో ఉన్నాయి. వీటిల్లో రోజుకు కనిష్టంగా రూ.200 నుంచి గరిష్ఠంగా రూ.3 వేల వరకూ రుసుం వసూలు చేస్తారు. వీటికి ఆన్‌లైన్ ద్వారా ముందస్తు బుకింగ్ సదుపాయం ఉంది. వీటితో పాటు పలు ప్రైవేటు.. ఆధ్యాత్మిక సంస్థల వసతి గృహాలూ భక్తులకు వసతి సౌకర్యం కల్పిస్తున్నాయి. దేవస్థానం నిత్యాన్నదాన పథకం కింద భక్తులందరికీ ఉచిత అన్నప్రసాదం అందిస్తోంది. కోల్‌కతా-చెన్నై జాతీయ రహదారిపై తుని పట్టణానికి 18 కి.మీ.ల దూరంలో.. కాకినాడ నగరానికి 45 కి.మీ.ల దూరంలో.. రాజ మహేంద్రవరానికి 80 కి.మీ.ల దూరంలో.. విశాఖపట్నం నుంచి 120 కి.మీ.ల దూరంలో అన్నవరం ఉంది. అన్నవరానికి రైల్ సౌకర్యం కూడా ఉంది.

*-- విజయభాను ప్రతినిధి, అన్నవరం*

## శివసదన్ కాటేజీ నిర్మాణానికి రూ.10 లక్షలు విరాళము



తూ.గో.జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం రత్నగిరి కొండపై ఎంతో పతిష్టాత్మకముగా నిర్మిస్తున్న శివసదన్ డోనార్ స్కీమ్ గది ఒక్కంటికి విరాళముగా సిఎమ్ఆర్ రమణ రూ.10 లక్షల విరాళముగా ఈవో ఎమ్.జితేంద్రకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సుపరింటెండెంట్ దామెర కృష్ణారావు, టెంపుల్ ఇన్ స్పెక్టర్ పోల్నాటి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.





*గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 20 మంది దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను పంపిణీ చేస్తున్న వి.వి. లక్ష్మీనారాయణ (అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్) ముంబయి మరియు వి.వి. వేణుగోపాల్ రావు (డైరెక్టర్ ఆఫ్ ఫైనాన్స్ స్టీల్ ప్లాంట్ , విశాఖపట్నం) పంపిణీ చేశారు. వృద్ధులకు బియ్యం పంపిణీ చేశారు.*

## నేటినుంచి రెండోవిడత చందనం అరగదీత

సింహాచల : సింహగిరిపై వేంచేసియున్న శ్రీ సింహాద్రిఅప్పన్న చందనయాత్ర గత బుధవారం జరగగా చందనయాత్రనాడు స్వామికి మొదట విడత చందన సమర్పణ జరగగా రెండవ విడతగా వైశాఖ శుద్ధ పౌర్ణమి నాడు సమర్పించనున్నారు. అందులో భాగంగా చందనం అరగదీతకు అవసరమగు చందనం చెక్కలను వైదికులు దేవస్థాన సిబ్బంది సిద్ధం చేస్తున్నారు. సుమారుగా 32 కేజీల చందనం కర్రలను సిద్ధం చేశారు. చక్కల ద్వారా అరగదీసిన చందనముకు వైదికులు సుగంధ ద్రవ్యములు వనమూలికలు కలిపి చందనంను వచ్చే పౌర్ణమి నాడు అప్పన్నకి సమర్పించనున్నారు.

## నేడు కామన్వెల్త్ విజేతలకు సన్మానం

### ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటన

హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో క్రీడాకారులకు రెండు శాతం రిజర్వేషన్లు అమలు చేయనున్నట్లు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారు. కామన్వెల్త్ క్రీడల్లో పథకాలు సాధించిన క్రీడాకారులు ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిశారు. తాము సాధించిన పథకాలను కేసీఆర్‌కు చూపించారు. క్రీడాకారులను బ్యాడ్మింటన్ ప్రధాన కోచ్ పుల్లెల గోపీచంద్ ముఖ్యమంత్రికి పరిచయం చేశారు. ఈ సందర్భంగా క్రీడాకారులను అభినందించిన సీఎం.. వారిని సన్మానించారు. కామన్వెల్త్ క్రీడల్లో అద్భుతమైన ప్రతిభను కనబర్చి పతకాలు సాధించిన క్రీడాకారులు రాష్ట్రానికి, దేశానికి గొప్ప గౌరవం తీసుకొచ్చారని కేసీఆర్ ప్రశంసించారు. రాష్ట్ర పర్యాటక రంగ ప్రచారం కోసం ఏడు దేశాల్లో బైక్ లపై పర్యటించి వచ్చిన మహిళలను కూడా ముఖ్యమంత్రి అభినందించారు. కామన్వెల్త్ పతక విజేతలకు ఈ నెల 23న లాల్ బహదూర్ స్టేడియంలో సన్మానం, అభినందన సభ ఏర్పాటు చేయనున్నారు.






Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of VIJAYABHANU PUBLICATIONS PVT. LTD., Published and Printed at VIJAYABHANU PRESS, D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ◆ Phone : 2564353, Fax : 0891-2569004 ◆ e-mail: vijayabhanudaily@gmail.com

## జివియంసి స్మార్ట్ సిటీ ఆపరేషన్ సెంటర్ సందర్శించిన

# ఉమ్మడి రాష్ట్రగవర్నర్ దంపతులు ఇ.యస్.ఎల్ నరశింహన్

- సిటీ ఆపరేషన్ సెంటర్ ఏర్పాటు, నిర్వహణ గురించి వివరించిన కమిషనర్
- ఎక్సలెంట్, వెరీగుడ్ అని కితాబిచ్చిన గవర్నర్
- పూర్తి స్ధాయిలో సిటీ ఆపరేషన్ సెంటర్ వినియోగించండి



విశాఖపట్నం : జివియంసి స్మార్ట్‌సిటీ ఆపరేషన్ సెంటర్‌ను ఉమ్మడి రాష్ట్ర గవర్నర్ దంపతులు ఇ.యస్.ఎల్ నరశింహన్ శనివారం ఉదయం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా తోలుత స్మార్ట్‌సిటీకి సంబంధించిన వివిధ కార్యక్రమాలకు చెందిన ఫొటో ప్రదర్శనను తిలకించారు. జివియంసి కమిషనర్ హరినారాయణన్ సిటీ ఆపరేషన్ సెంటర్ ఏర్పాటు, నిర్వహణ, ప్రజలకు అందించేసేవల గురించి గవర్నర్ దంపతులకు కూలంకషంగా వివరించారు. సిటీ లెవెల్‌లో అందించే సేవలు, రాష్ట్రస్ధాయిలో అందించే సేవలగురించి కమిషనర్ వివరించారు. సిటీ స్ధాయిలో జివియంసి, పోలీసు, ఏపియస్ఆర్.టి.సి యుటిలిటీస్ మరియు అదర్ డిపార్ట్‌మెంట్స్ కు సంబంధించిన సేవలను గురించి వివరించారు. అదేవిదంగా రాష్ట్రస్ధాయిలో సి.డి.యం.ఏ, రియల్ టైం గవర్నెన్స్, ఏ.పి స్టేట్ ఫైబర్ లిమిటెడ్ ద్వారా అందిస్తున్న, అంజేయనున్న సేవల వివరాలను తెలియజేశారు. ప్రజల ఆకాంక్షలు, పరిపాలన ద్వారా అందించే సేవలలో భాగంగా వాయుక్వాలిటీ, డిజాస్టర్ అండ్ ఎమర్జన్సీ, పబ్లిక్ సేఫ్టీ అండ్ సెక్యూరిటీలకు దోహదపడుతుందని పేర్కొన్నారు. నగరంలో 2500 సి.సి కెమెరాలు ఏర్పాటు, ప్రముఖమైన 50 ప్రాంతాలలో పబ్లిక్ అడ్రస్ సిస్టం, స్మార్ట్ పోల్ మల్టీ యుటిలిటీ, 1.50 లక్షల ఎల్.ఇ.డి లైట్లు, 50 చోట్ల ఎన్విరాన్‌మెంటల్ సెన్సార్లు, సిటిజెన్ సర్వీసులు, ప్రజల ఫిర్యాదులు, సాలిడ్ వేస్ట్ మేనేజిమెంట్, ఇ-గవర్నెన్స్ మాడ్యూల్స్, రెయిన్‌ఫాల్, పవర్ కన్సర్వేషన్ అంశాలను గురించిన ఏర్పాట్ల గురించి సోదాహరణంగా పవర్‌పాయింట్ తరహాలో వివరించారు.

అన్ని అంశాలను కూణ్ణంగా పరిశీలించి, ఆకళింపు చేసుకొన్న గవర్నర్, కమిషనర్ హరినారాయణన్‌ను ఎక్సలెంట్, వెరీగుడ్ అని అభినందించారు.

సర్వీసులన్నీ ప్రతి రోజు నిర్వహిస్తున్నారాఅని గవర్నర్ ప్రశ్నించగా కొన్నింటిని మాత్రమే ప్రతి రోజు నిర్వహిస్తున్నామని, మిగతావాటిని త్వరలో వినియోగంలోకి తెచ్చి స్మార్ట్‌సిటీకి స్మార్ట్ సేవలు అందించడానికి కార్యాచరణ రూపొందించినట్లు కమిషనర్ వివరించారు.

పర్యటనలో ఇన్‌ఛార్జి కలెక్టర్ జి.సృజన, అదనపు కమిషనర్ (జనరల్) జివివియస్ మూర్తి, సకలారెడ్డి, జాయింట్ సి.పి దాడి సత్యనారాయణ, డిసిపి శేముషి బాజ్‌పేయి, ఏసిపి అన్నెపు నరశింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యే బాలకృష్ణ ఇంటి దగ్గర ఉద్రిక్తత

హిందూపురం : ఎమ్మెల్యే బాలకృష్ణ ఇంటి దగ్గర ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రధాని మోదీపై ఆయన చేసిన వ్యాఖ్యల్ని నిరసిస్తూ... బీజేవైఎం కార్యకర్తలు ఇంటిని ముట్టడించేందుకు వచ్చారు. బాలయ్యకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ... ఇంట్లోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు... కార్యకర్తల్ని అడ్డుకున్నారు. కార్యకర్తలు పోలీసులతో వాగ్వాదానికి దిగగా... తోపులాట కూడా జరిగింది. ఆందోళనకారుల్ని అరెస్ట్ చేసి... బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. చంద్రబాబు చేపట్టన ధర్మ పోరాట దీక్షలో ప్రధానిపై ఎమ్మెల్యే బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలపై దుమారం రేగింది. తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడికక్కడే ఆ పార్టీ కార్యకర్తలు ఆందోళనకు దిగారు. ఏపీలో బీజేపీ నేతలు... ఏకంగా గవర్నర్‌కు ఫిర్యాదు కూడా చేశారు. తెలంగాణలో కూడా బాలకృష్ణపై చర్యలు తీసుకోవాలంటూ పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు కూడా చేశారు.

# వివాదాలకు తావులేని నిర్ణయాలు

### క్యాస్టింగ్ కౌచ్, చిత్రపరిశ్రమ సమస్యలపై చర్చ - ముగిసిన సినీ పెద్దల భేటీ

హైదరాబాద్ : సినీ పరిశ్రమలో నెలకొన్న సమస్యలు, తాజా పరిస్థితులపై చర్చించేందుకు అన్నపూర్ణ స్టూడియోలో సినీ ప్రముఖులు నిర్వహించిన సమావేశం ముగిసింది. దాదాపు రెండు గంటలపాటు జరిగిన ఈ సమావేశంలో క్యాస్టింగ్ కౌచ్, చిత్ర పరిశ్రమలో నెలకొన్న సమస్యలపై చర్చించారు. ఈ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు సమాచారం. ఈ నిర్ణయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకు కాసేపట్లో సచివాలయంలో తెలంగాణ సినిమాటోగ్రఫి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో వీరు భేటీ కానున్నారు. ఈ విస్తృతస్థాయి భేటీలో ప్రముఖ నిర్మాతలు, దర్శకులు, నిర్మాతల మండలి, నటీనటుల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు. మా అధ్యక్షుడు శివాజీ రాజా కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

సినీనటి శ్రీరెడ్డి వివాదం, ప్రముఖ నటుడు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌పై శ్రీరెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం, దాని వెనుక తానే ఉన్నానంటూ రామ్‌గోపాల్ వర్మ ప్రకటించడంతో.. వర్మపై చర్యలు తీసుకోవాలని పవన్‌కల్యాణ్ శుక్రవారం ఫిలిం ఛాంబర్ ఎదుట ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే.

ప్రస్తుత పరిణామాలు, పవన్‌కల్యాణ్ నిరసనల నేపథ్యంలో ఈ విస్తృతస్థాయి సమావేశాన్ని సినీపెద్దలు నిర్వహించారు. పరిశ్రమలో జరుగుతున్న సంఘటనలు, లైంగిక వేధింపులు సహా పలు కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. మంత్రితో భేటీ అనంతరం ప్రత్యేక కార్యచరణ ప్రకటించి సినీ పరిశ్రమలో వివాదాలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని సినీ పెద్దలు భావిస్తున్నారు.

# మనల్ని టచ్ చేయాలంటే.. వాళ్లకు ప్యాంట్ తడిచిపోవాలి..



జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై మీడియా, సోషల్ మీడియాలో కొనసాగుతున్న దాడిపై అభిమానులు కలత చెందారు. దాంతో పవన్‌కు సంఘీభావం తెలిపేందుకు కొందరు అభిమానులు జనసేన కార్యాలయానికి వెళ్లారు. ఆవేదనతో ఉన్న అభిమానులను పవన్ పలకరించారు. ఎలాంటి విద్వేషాలకు తావివ్వ వద్దని పవన్ నచ్చచెప్పారు. తన తల్లి, తనపై శ్రీరెడ్డి చేసిన నీచమైన వ్యాఖ్యలకు మనస్తాపం చెందిన పవన్ శుక్రవారం హైదరాబాద్ ఫిలిం ఛాంబర్‌లో నిరసన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో కొందరు మీడియా వాహనాలను ధ్వంసం చేయడం వివాదంగా మారింది. ఈ నేపథ్యంలో అభిమానులు తమ నాయకుడు పవన్‌ను కలుసుకొన్నారు. ఈ సందర్బంగా వారి మధ్య ఆసక్తికరమైన చర్చ జరిగింది. ఈ చర్చను ఓ టెలివిజన్ ఛానెల్ ఎక్స్‌క్లూజివ్ పేరిట ప్రసారం చేసింది. ఎవరితోనూ నాకు గొడవలు లేవు. కొందరు కావాలనే నన్ను వివాదాల్లోకి లాగుతున్నారు. ఎవరో మన పిల్లలు కార్ల అద్దాలు పగులకొట్టారని ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై అధికారులు వచ్చి నాతో మాట్లాడారు. గత ఎనిమిది నెలలుగా నన్ను టార్గెట్ చేస్తున్నారు. ఇలా రెచ్చగొడుతూ నా సహనాన్ని పరీక్షిస్తున్నారు.

ఎవరో చేసిన గొడవలకు నేనెలా బాధ్యుడిని అవుతాను అని పవన్ ఆవేదన వ్యక్తం చేశారు. చట్టానికి వ్యతిరేకంగా ఈ పనులు చేయవద్దు. చట్టానికి అతీతులు ఎవరూ కారు అని ఆయన అన్నారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాటలకు ఆవేశంతో ఉన్న అభిమానులు అడ్డుతగిలారు. అయితే ఫ్యాన్స్‌ను పవన్ నచ్చచెప్పారు. కానీ అభిమానులు ఆవేశంతో ఊగిపోయారు. ఎవరైనా మనల్ని అనాలంటే ప్యాంటులు తడిచిపోవాలి అని అభిమానులు గట్టిగా అరిచారు. సోషల్ మీడియాలో కొందరు చేస్తున్న వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్నారనే విషయాన్ని అభిమానులు పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకొచ్చారు. అయితే అలాంటి విషయాలకు దూరంగా ఉండాలని జనసేన అధినేత సూచించారు. మనల్ని ఎవరూ ఏమైనా అంటే వాటిని భరిద్దాం. భరించని రోజున మీకు నేను సూచనలు చేస్తాను. అప్పుడు వారితో తాడో పేడో తెల్చుకొందాం అని పవన్ అన్నారు.

అల్లుఅర్జున్-అను ఇమ్మాన్యుయేల్ జంటగా టాలీవుడ్‌లో రానున్న మూవీ 'నాపేరు సూర్య'. వక్కంతం వంశీ డైరెక్షన్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమా షూటింగ్ పూర్తి అయ్యింది. తాజాగా ఈ సినిమా నుండి మరో పాటను విడుదల చెయ్యబోతున్నారు చిత్ర యూనిట్. ఇటీవల విడుదలిన ఈ సినిమా టిజర్ కు మంచి రెస్పాన్స్ లభించింది. దీంతో సినిమాపై అంచనాలు పెరిగాయి. ఈ సినిమా ఆడియో వేడుకకు మెగా హీరోలందరు ఒకే వేదికపై కనిపించబోతున్నారని సమాచారం.

అల్లుఅర్జున్-అను ఇమ్మాన్యుయేల్ జంటగా టాలీవుడ్‌లో రానున్న మూవీ 'నాపేరు సూర్య'. వక్కంతం వంశీ డైరెక్షన్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమా షూటింగ్ పూర్తి అయ్యింది. తాజాగా ఈ సినిమా నుండి మరో పాటను విడుదల చెయ్యబోతున్నారు చిత్ర యూనిట్. ఇటీవల విడుదలిన ఈ సినిమా టిజర్






# పవన్ కళ్యాణ్, చిరంజీవి, అల్లు అర్జున్, రామ్ చరణ్ ఒకే వేదికపై?

కు మంచి రెస్పాన్స్ లభించింది. దీంతో సినిమాపై అంచనాలు పెరిగాయి. అదంతా పుకారే... నాపేరు సూర్య సినిమాకు సంభందించి ఒక న్యూస్ చక్కర్లు కొడుతోంది. ఈ చిత్రం హాలీవుడ్ కాపీయేనంటూ సోషల్‌మీడియాలో ప్రచారం జోరందు కుంది. 2002లో వచ్చిన 'యాంట్వోన్ ఫిషర్' సినిమాను కాపి కొట్టి ఈ సినిమా తీసారని వచ్చిన వార్తలో నిజం లేదని సమాచారం. తాజాగా చిత్ర యూనిట్ కూడా ఈ విషయంపై స్పందించడం జరిగింది. అర్జున్ కోసం పవన్ తాజాగా పవన్ కళ్యాణ్ చాంబర్ లో నిరసన తెలుపడానికి వచ్చిన సంగతి తెలిసిందే. అల్లు అర్జున్, చరణ్ ఛాంబర్ కు వచ్చి తమ మద్దతు తెలపడం జరిగింది. లేటెస్ట్ న్యూస్ ప్రకారం నాపేరు సూర్య సినిమాకు సంభందించిన ఆడియో ఫంక్షన్ ఈ నెల 29న హైదరాబాద్ లో జరగనుంది ఈ వేడుకకు పవన్ కళ్యాణ్ వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. నా పేరు సూర్య సినిమాకు నాగబాబు కూడా సహ నిర్మాతగా వ్యవహరించడం జరిగింది. నాగబాబు పవన్ ను ఆడియో వేడుకకు పిలిచినట్లు సమాచారం. దాదాపు పవన్ ఈ వేడుకకు రావడం ఖాయనని చెబుతున్నారు కొందరు మెగా అభిమానులు. బన్ని పవన్ కు మద్దతు తెలిపాడు. దీన్ని బట్టి చూస్తుంటే పవన్, బన్ని ఈ వేడుకకు హాజరు కాబోతున్నట్లు సమాచారం. చిరంజీవి కూడా ఈ ఫంక్షన్ కు రాబోతున్నాడు.